దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS
డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B

విజయవాడ VIJAYAWADA | సంపుటి : 25 Vol.No : 25 | సంచిక : 179 Issue No : 179 | ది.17-10-2026 Date : 17-10-2026 | శనివారం Saturday | పేజీలు : 8 Pages : 8 | వెల : రూ.1/- Rs.1/-

## ప్రజలంతా సంతోషంగా ఉండాలని అమ్మ వారిని కోరుకున్నా : సీఎం చంద్రబాబు

- కనకదుర్గమ్మ కు ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు చీర,సారె సమర్పణ
- రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన సీఎం
- పట్టు వస్త్రాల సమర్పణ సమయంలోనూ సాగిన సామాన్యుల దర్శనాలు







**విజయవాడ,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు సీఎం తెలిపారు. దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతు లకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ ముఖ్యమంత్రికి పరివేష్టం అలంకరించారు. అనంతరం సీఎం పట్టువస్త్రాలు, సారెను అమ్మవారికి సమర్పించారు . పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారి అంతరాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఎం పట్టువస్త్రాలు సమర్పించే సమయంలోనూ సామాన్య భక్తుల దర్శనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా క్యూ లైన్లను కొనసాగించారు. పూజల అనంతరం ఆశీర్వ చన మండపంలో అర్చకులు సీఎం దంపతులకు వేదాశీస్సులు అందజేశారు. ఈవో శీనానాయక్ అమ్మవారి శేషవస్త్రాలను అందించగా, ఆలయ చైర్మన్, ఈవో అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

**6 రోజుల్లో 8 లక్షల మంది భక్తుల దర్శనం..** ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... 'రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు. ప్రభుత్వం తరఫున కుటుంబ సమేతంగా అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించాను. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పాలక మండలి, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఆరు రోజుల్లోనే ఎనిమిది లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. విజయవాడ ఉత్సవ్ 2.0, జాతీయ సరస్ మేళా కూడా ఇక్కడే జరుగుతున్నాయి. దేశంలో ప్రముఖంగా నిర్వహించే ఉత్సవాల్లో విజయవాడ దసరా ఉత్సవాలు చోటు సంపాదించుకోవడం శుభపరిణామం. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆకాంక్షించాను. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య కరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్దాలని అమ్మవారిని కోరుకున్నాను' అని సీఎం చంద్రబాబు అన్నారు.

## తెలంగాణకు మరో దిగ్గజ కంపెనీ..
# సీఎం రేవంత్‌తో హ్యుందాయ్ ప్రతినిధుల భేటీ

- సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధులు
- జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన
- ఈ కేంద్రం ద్వారా 4,275 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి
- అనుమతులు వేగంగా జారీ చేయాలని అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్
- తెలంగాణలో కార్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని హ్యుందాయ్‌కు ఆహ్వానం



**హైదరాబాద్,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. శుక్రవారం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ భేటీ సందర్భంగా తమ పెట్టుబడి ప్రణాళికలను సీఎంకు వారు వివరించారు. జహీరాబాద్‌లో నెలకొల్పబోయే ఆర్ అండ్ డీ కేంద్రం స్వరూపం, దాని ద్వారా లభించే ఉపాధి కల్పన వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలియజేశారు. హ్యుందాయ్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుండటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

## నారా భువనేశ్వరికి చంద్రబాబు అభినందనలు



- విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు
- సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బృందానికి ప్రత్యేక అభినందనలు
- తలసేమియా చిన్నారులకు ఉచిత రక్తం అందించడం గొప్ప మానవీయ సేవ
- విద్యా, వైద్య రంగాల్లో ట్రస్ట్ అందిస్తున్న సేవలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి
- ప్రాణ రక్షణే లక్ష్యంగా ట్రస్ట్ ముందుకు సాగాలని ఆకాంక్ష

**విజయవాడ, అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలపై ప్రశంసల వర్షం కురిపించారు. విజయవాడలో కొత్తగా ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో, ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రక్తం అందక ఏ ఒక్క ప్రాణమూ ప్రమాదంలో పడకూడదనే గొప్ప సంకల్పంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన అర్ధాంగి, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఆమె బృందానికి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. "ఒక్కరి రక్తదానం ఆపదలో ఉన్న మరో కుటుంబానికి జీవన ప్రదాత అవుతుంది. ప్రాణాపాయంలో ఉన్నవారికి పునర్జన్మనిస్తుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించాలనే నిర్ణయం గొప్ప మానవీయ సేవ అని ఆయన కొనియాడారు. కేవలం బ్లడ్ బ్యాంక్ మాత్రమే కాకుండా, విద్య, వైద్యం, మహిళా సాధికారత వంటి ఎన్నో రంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను చంద్రబాబు గుర్తుచేశారు. 'సంజీవని మొబైల్ క్లినిక్స్' ద్వారా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు చేరవేయడం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రతి సేవలో మానవత్వం, ప్రతి ప్రయత్నంలో ప్రాణ రక్షణే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ తన సేవలను మరింతగా విస్తరించి, ఎంతో మందికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# స్థానిక సమరానికి టీడీపీ సై..
## అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు పక్కా వ్యూహం



- పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన టీడీపీ అధిష్ఠానం
- సీఎం చంద్రబాబు, లోకేశ్, పల్లా నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ
- క్షేత్రస్థాయి అభిప్రాయాలు, ప్రజామోదం ఆధారంగా వడపోత
- మేయర్లు, చైర్మన్ల ప్రత్యక్ష ఎన్నిక నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ
- ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుతో అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యం

**విజయవాడ,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైన నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసిన టీడీపీ అధిష్ఠానం, ఇప్పుడు గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో నిమగ్నమైంది. ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ, సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం పార్టీ వద్ద ఉన్న సమాచారంపైనే ఆధారపడకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను విస్తృతంగా సేకరిస్తున్నారు. అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ఠ, ప్రజామోదం, నాయకత్వ లక్షణాలు, సేవా నిబద్ధత వంటి అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీకి సంబంధించి లోతైన విశ్లేషణ జరుపుతూ వడపోత కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నారు. ఈసారి మేయర్లు, మునిసిపల్ ఛైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరగనుండటంతో అభ్యర్థుల ఎంపిక మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో కేవలం పార్టీ కేడర్‌లోనే కాకుండా ప్రజల్లో మంచి పేరున్న, బలమైన అభ్యర్థులకే పట్టం కట్టాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ప్రత్యక్ష ఎన్నికల్లో వ్యక్తిగత ఇమేజ్ గెలుపోటములను ప్రభావితం చేస్తుందన్న అంచనాతో అన్ని కోణాల్లో ఆలోచించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. స్థానిక సంస్థల పాలన ప్రజల దైనందిన జీవితంతో ముడిపడి ఉంటుందని, అందుకే అత్యుత్తమ నాయకత్వాన్ని ప్రజలకు అందించాలన్నది తమ లక్ష్యమని టీడీపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ తమ పాలన ఉండేలా ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాభివృద్ధిని మరింత వేగవంతం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగానే స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

## మీ నమ్మకమే నా బలం.. మీ సేవే నా లక్ష్యం: హేమంత్ కుమార్ యాదవ్



**తిరుపతి,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 26వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిగా ఈతమా కుల హేమంత్ కుమార్ యాదవ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 28వ తేదీన జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఆయన నామినేషన్ సమర్పించి, వార్డు ప్రజల ఆశీస్సులు, మద్దతు కోరారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ 26వ వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వార్డు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తానని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో కార్పొరేటర్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచినట్లు వెల్లడించారు. వార్డులోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి బాధ్యతాయుతంగా పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలతో మమేకమై, వారి సూచనలు, సలహాలను స్వీకరిస్తూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికైతే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ నెల 28వ తేదీన జరగనున్న ఎన్నికల్లో 26వ వార్డు ప్రజలు తమ అమూల్యమైన ఓటును వేసి తనను గెలిపించాలని హేమంత్ కుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆదరాభిమానాలతో విజయం సాధించి, వార్డు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో కట్ట జయరాం యాదవ్, నరసింహ ఆచారి, మహేష్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అలరించిన ప్రముఖ దర్శకుడు రామాచారి "భక్తి సంగీతం



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** అన్నమాచార్య భావనా వాహిని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాదబ్రహ్మోత్సవం--26లో భాగంగా శుక్రవారం ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు రామాచారి కొమండూరి భక్తి సంగీతంతో అలరించారు. అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి భక్తులను భక్తిరసంలో ముంచెత్తారు. విష్ణు సహస్రనామం, లక్ష్మీ అష్టోత్తరం, అన్నమాచార్య అష్టోత్తరం, లలితా సహస్రనామ పారాయణాలతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం రామాచారి 'భావములోన', 'వినరో భాగ్యము', 'హరి అవతారమితడు', 'నారాయణాయ సంజ్ఞోబ్రహ్మణే', 'నారాయణతే నమో నమో' తదితర కీర్తనలను ఆలపించారు. అజయ్ తబలాపై, రాజు కీబోర్డుపై వాయిద్య సహకారం అందించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆధ్యాత్మిక వక్త వి.ఎస్.ఆర్. మూర్తి, ఈటీవీ మాజీ ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్, కన్సల్టెంట్ అజయ్ శాంతి అన్నమాచార్య భావనా వాహిని సేవలను కొనియాడారు. పద్మశ్రీ డా. శోభారాజు అన్నమయ్య సంకీర్తనలను విస్తృతంగా ప్రచారం చేస్తూ, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని మూర్తి పేర్కొన్నారు. నారాయణ నామస్మరణతో మార్మోగుతున్న అన్నమయ్యపురం భవిష్యత్తులో మరో తిరుపతిలా ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందాలని ఆకాంక్షించారు. కాలానుగుణంగా మార్పులు వచ్చినా అన్నమయ్య సంకీర్తనల ప్రచారానికి శోభారాజు అంకితభావంతో కృషి చేస్తున్నారని అజయ్ శాంతి ప్రశంసించారు. ప్రతిరోజూ ఒక్కో కళాకారుడికి వేదిక కల్పించి వారి ప్రతిభను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. నాదబ్రహ్మోత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి సందర్భంగా ఏటా ప్రదానం చేసే 'ధైర్య' పురస్కారాన్ని ఈ ఏడాది సిద్ధచక్ర రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డా. సత్య సింధుజకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ఏఐజీ ఆసుపత్రుల ఛైర్మన్ డా. డి. నాగేశ్వర్ రెడ్డి సమక్షంలో పురస్కార ప్రదానం జరగనుంది. ఈ కార్యక్రమం ముగింపులో స్వరసిద్ధి వేంకటేశ్వర స్వామివారికి మంగళహారతి సమర్పించి, భక్తులకు ప్రసాదం వితరణ చేశారు.

## బి.ఆర్.ఎస్.చీఫ్ కేటీఆర్ తో చిర్రా రవీందర్ భేటీ



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శేరిలింగంపల్లికి చెందిన ఉద్యమ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తన జన్మదినం సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు తెలపడంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ప్రతిమను కేటీఆర్‌కు బహూకరించారు. ఈ భేటీలో రాష్ట్ర రాజకీయ పరిణామాలతోపాటు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రస్తుత పరిస్థితులు, స్థానిక రాజకీయ అంశాలపై ఇరువురూ చర్చించారు.

# సమాచార శాఖ ఉద్యోగుల అనుభవాలు సేవలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం

● రిటైర్డ్ ఉద్యోగుల డైరీ రూపకల్పనకు సహకరించాలి. ● ముఖ్య అతిథి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు, రిటైర్డ్ అదనపు సంచాలకులు ఎ.ఎల్ కిష్మత్ కుమార్







**విశాఖపట్నం,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** సమాచార శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల అనుభవాలు, సేవలు ఎంతో విలువైనవని, సాంకేతిక మార్పులకు అనుగుణంగా కొత్త తరానికి శిక్షణ అందించడంలో శాఖ ప్రాధాన్యతను మరింత పెంపొందించ వలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్థానిక ద్వారకానగర్ పెన్షనర్స్ భవనంలో ఆదివారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ విశ్రాంత ఉద్యోగుల ప్రాంతీయ సమావేశం లో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాచార శాఖలో దశాబ్దాల అనుభవాన్ని సమాజ హితానికి, రాబోయే తరాలకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల అనుభవాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు సావనీర్ రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉద్యోగులు కె. రాజబాబు, పి. గోవిందరావు, ఆర్ త్యాగరాజు, శిష్టా నాగేశ్వరరావు తదితరుల అనుభవాలను వ్యాసాల రూపంలో పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు కె. జయరావు సంఘ అభివృద్ధికి భవిష్యత్ లో చేయబోయే వార్షిక నివేదికను సభ ముందు ఉంచారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం రాష్ట్ర స్థాయిలో సంఘం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం జోనల్ కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతీయ నివేదికను సమర్పించి, స్థానికంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను సభ దృష్టికి తెచ్చారు. రాబోయే రోజుల్లో సంఘం జ్ఞాపికగా తీసుకురానున్న 'సావనీర్' (రాశీబజవఅఙతీ) రూపకల్పనపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. పుస్తక ప్రచురణ, అందులో చేర్చాల్సిన సమాచారంపై సీనియర్ సభ్యులు పలు విలువైన సలహాలు, సూచనలు అందించారు. నిధుల వినియోగం, సభ్యత్వ రుసుములు మరియు భవిష్యత్ సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణపై పలు తీర్మానాలు చేశారు. ఆత్మీయ సమావేశంలో సమాచార శాఖలో సుదీర్ఘ సేవలు అందించి, ఇటీవల పదవీ విరమణ చేసిన నూతన సభ్యులను సంఘం తరపున ఘనంగా సత్కరించి అసోసియేషన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవిత కాలంలో ఎక్కువ భాగం సమాజానికి, శాఖకు సేవ చేసి 70 ఏళ్లు పైబడిన సీనియర్ వృద్ధ విశ్రాంత ఉద్యోగులను శాలువాలు, జ్ఞాపికలతో సభలో సన్మానించారు. సమాచార రంగంలో తమకున్న దశాబ్దాల అనుభవాన్ని సమాజ హితానికి, రాబోయే తరాలకు ఉపయోగపడేలా సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. దశాబ్దాల పాటు శాఖలో కలిసి పనిచేసిన సహచరులను కలుసుకోవడం పట్ల సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఆత్మీయ సమావేశం లో రాష్ట్ర అధ్యక్షులు కె. జయరావు, జనరల్ సెక్రటరి పి. వెంకటప్పారావు, వి. మణిరామ్, పి. గోవిందరావు, పి ఎస్ ప్రసాదరావు, త్యాగరాజు, పి వెంకట అప్పారావు, టీవీఎస్ రాజు, జిల్లా పింఛన్దారుల సంఘం అధ్యక్షులు డి డి ప్రసాద్ రావు, సమాచార పౌర సంబంధాల శాఖ జెడి కె.సదారావు, కమిషనరేట్ డిప్యూటీ డైరెక్టర్ డి. రమేష్ పాల్గొని తమ అమూల్యమైన సందేశాలను తెలిపారు. రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ డి నాగార్జున, ఐ. కాశయ్య, జి వెంకటేశ్వరరావు, బి పిచ్చయ్య, ఆనందరావు, డి. సాయి బాబా, తదితరులు పాల్గొన్నారు.

# చదువుల తల్లి సరస్వతి మాత అవతారంలో సాక్షాత్కరించిన అమ్మవారు







**విస్సన్నపేట,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనశీ శరత్ ఋతువు ఆస్వయుజ మాసం శుక్లపక్షం షష్టి శుక్రవారం మూలా నక్షత్రం యుక్త శుభలగ్న నందు పద్మశాలి వీధిలో సుహాసినిల ఆధ్వర్యంలో సరస్వతి అమ్మవారి కి విజయదశమి సందర్భంగా కుంకుమ పూజ నిర్వహించారు. పుట్రెల మారమ్మ తల్లి అమ్మవారు స్థానిక ద్వారకా నగర్ కనకదుర్గమ్మ అమ్మవారు సరస్వతీ మాతగా సాక్షాత్కరించారు. భక్తులు అమ్మవారిని పూజించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. పుట్రెల మారెమ్మ తల్లి సన్నిధిలో ఆలయ చైర్మన్ చర్ల శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# జిల్లా దేవాదాయ-శాఖ అధికారిగా సుధారాణి బాధ్యతలు స్వీకరణ..



**కాకినాడ,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** జిల్లా దేవాదాయ శాఖ అధికారి(డీఈవో)గా కవిటపు లక్ష్మీ సుధారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ డివిజన్ తనిఖీ అధికారి వడ్డి ఫణీంద్ర కుమార్, ఇతర అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు జోన్-1లోని అనకాపల్లి జిల్లా డీఈవో గా పనిచేసి జోన్-2పరిధిలోని కాకినాడ జిల్లా దేవాదాయ శాఖ అధికారిగా బదిలీపై వచ్చానని తెలిపారు.తన పరిధిలోని అన్ని దేవాలయాలలో సనాతన ధర్మాన్ని కాపాడుతూ, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తామని అన్నారు. అలాగే దేవాలయాల ఆస్తులు పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. డీఈవో సుధారాణిని పలువురు దేవాదాయ శాఖ అధికారులు, ఈవోలు, సిబ్బంది అభినందించారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లను మర్యాదపూర్వకంగా కలిశారు.

# పుట్రేల మారెమ్మ అమ్మవారి దేవాలయానికి స్టేట్ బ్యాంకు బయో డిగ్రేడబుల్ ప్రసాదాల సంచులు అందజేత




**విస్సన్నపేట,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల మారెమ్మ తల్లి దేవాలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు స్టేట్ బ్యాంక్ పుట్రేల మేనేజర్ సాయి తరుణ్ చేతుల మీదుగా డిగ్రేడబుల్ ప్రసాదాల సంచులు చైర్మన్ తెర్ల శ్రీనివాసరావు కు అందించారు. బ్యాంకు సంబంధిత అకౌంటెంట్ రమా మాధురి, నగదు అధికారి ధర్మేంద్ర కుమార్, ఇతర గ్రామ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యపై స్పందించి ప్లాంట్ ఏర్పాటు చేసిన పుట్టగుంట సతీష్



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బొమ్ములూరు కంద్రిక గ్రామంలో గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు పుట్టగుంట వెంకట సతీష్ హెల్త్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఫౌండేషన్ చైర్మన్, లయన్ డాక్టర్ పుట్టగుంట సతీష్ కుమార్ ప్రారంభించారు. సుమారు రూ.1.50 లక్షల వ్యయంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో తాగునీటి సమస్యను గుర్తించిన మాజీ సర్పంచ్ కాటూరు విజయ్ భాస్కర్ స్థానికులతో కలిసి పుట్టగుంట సతీష్ కుమార్‌ను సంప్రదించారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో మాట్లాడి, అతి తక్కువ సమయంలో ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సహకరించారు. ప్లాంట్ ప్రారంభోత్సవం అనంతరం సహకారం అందించిన పుట్టగుంట సతీష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ మాజీ సర్పంచ్ కాటూరు విజయ్ భాస్కర్, సహకార బ్యాంకు డైరెక్టర్ గుల్లపూడి ప్రసాద్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పామర్తి సాంబశివరావు, పామర్తి శివశంకర్, ప్రవీణ్, బి. శివశంకర్, చీమట పుల్లయ్య, మెడకుధురూ ఏసుపదం, గాలంకి అప్పారావు, గండేపూడి ప్రసాద్, కుందేటి ఆదాము, మట్టా అచ్చయ్య, చింతా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో ఎస్సీ,ఎస్టీ లకు మొండి చెయ్యి- బట్టపర్తి రాజు

**కొండూరు,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు గ్రామ స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో ఎస్సీ,ఎస్టీలకు ఎన్నికల కమిషన్ అధికారులు మొండి చెయ్యి చూపించినట్లు ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ ఎస్టీ ప్రొటెక్షన్ సేల్ అధ్యక్షులు బట్టపర్తి రాజు అసహనం వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జి.కొండూరు గ్రామంలో ఎస్సీ, ఎస్టీల జనాభా అధికంగా ఉందని,గ్రామంలో రెండు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, ప్రస్తుతం వీటిని జి.కొండూరు-1 ఎంపీటీసీ ని బిసి జనరల్ కు, జి.కొండూరు-2 ఎంపీటీసీ నస్థానాన్ని జనరల్ మహిళకు రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. వీటిలో ఎంపీటీసీ-1 స్థానంలో ఎస్సీ ఓట్లర్లు సుమారు 1300 పైగా ఉన్నారని ఈ ఎంపీటీసీ సెగ్మెంట్లో మొత్తం ఓట్లు 3395 ఉండగా, అత్యధికంగా ఎస్సీ జనాభా ఓట్లు కలిగిన ఈ స్థానాన్ని ప్రస్తుతం ఎన్నికల అధికారులు బీసీ జనరల్ స్థానానికి కేటాయించడంతో ఎస్సీ సామాజిక వర్గాలవారు గుర్రుగా ఉన్నారని రాజు అన్నారు.2006 లో జి.కొండూరు -1 ఎంపీటీసీ స్థానాన్ని అప్పట్లో ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వేషన్ కల్పించి నేటికీ సరిగ్గా 20 ఏళ్లు కావస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఈ స్థానాన్ని 1994-95 సంవత్సరంలో ఎంపీటీసీ ,జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందన్నారు.అప్పటి మండల వ్యవస్థ ప్రారంభం అయిన నాటినుంచి జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో జి.కొండూరు ఎంపీటీసీ-1 స్థానం నకు జరిగిన స్థానిక ఎన్నికల్లో 1994, 2001,2013, 2022 జరిగిన ఎన్నికలలో ఈ స్థానం నుంచి బీసీ గౌడ సామాజిక వర్గాలకు చెందిన మాజీ ఎంపీపీ ఉయ్యూరు వెంకట నరసింహారావు, వేములకొండ పద్మావతి, అలాగే వేములకొండ శైలజ (రెండుసార్లు) ఎస్సీల ఓట్లతో గెలుపొందార న్నారు.అయితే 2006 లో ఎంపీటీసీ-1స్థానం ఎస్సీ రిజర్వేషన్ కావడంతో తంగేళ్లమూడి వీరస్వామి పోటీ చేసి గెలుపొందారు.ఇటీవల ప్రకటించిన ఎంపీటీసీ రిజర్వేషన్ జాబితాలో కూడా ఈ స్థానాన్ని బీసీలకు కేటాయించడం సరికాదని బట్టపర్తి రాజు తన ఆవేదన వ్యక్తం చేశారు.2006 సంవత్స


మండల పరిషత్ కార్యాలయం


బట్టపర్తి రాజు

రంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికలలో ఒకసారి మాత్రమే ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించారు.ఆ తరువాత ఇప్పటివర కు జి.కొండూరు-1 సెగ్మెంట్ ఎస్సీ రిజర్వేషన్ కాలేదన్నారు. ఈ సారి కూడా జి.కొండూరు-1 ఎంపీటీసీ స్థానాన్ని బీసీలకు రిజర్వేషన్ కల్పించడం వల్ల ఒకే సామాజిక వర్గానికి(గౌడ) చెందిన వారు ఎన్నికవుతున్నారని రాజు వాపోయారు.ఓట్లు మావి సీట్లు మీవా అన్న చందంగా ప్రస్తుత స్థానిక ఎన్నికల పరిస్థితి నెలకొందని బట్టపర్తి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జి.కొండూరులో-2 ఎంపీటీసీ స్థానాన్ని రొటేషన్ పద్ధతిలో ఎస్టీలకు రిజర్వేషన్ చేయక పోవడంపై ఎన్నికల కమిషన్ అధికారుల తీరును రాజు ప్రశ్నిస్తున్నారు.ఈ సెగ్మెంట్లో ఎస్టీ సామాజిక వర్గాలైన లంబాడి, ఎరుకుల ఓట్లు అధికంగా ఉన్నాయి.సుమారు 30 సంవత్సరాలు మండల వ్యవస్థ ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు ఎన్నికల కమిషన్ అధికారులు రిజర్వేషన్ ను ఆ యా వర్గాలకు కల్పించక పోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని రాజు అన్నారు.ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి జి.కొండూరు -1 ఎంపీటీసీ స్థానాన్ని ఎస్సీలకు, జి.కొండూరు-2 స్థానాన్ని ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలని బట్టపర్తి రాజు డిమాండ్ చేశారు. లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించనునట్లు ఆయన తెలిపారు.

# బొమ్ములూరులో మాగంటి బాబు ప్రత్యేక పూజలు

● జడ్పీ చైర్మన్ అభ్యర్థిత్వ పత్రాలను పుట్టగుంట సతీష్ చేతుల మీదుగా స్వీకరణ





**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** ఏలూరు మాజీ ఎంపీ, మాజీ మంత్రి మాగంటి బాబు శుక్రవారం తన సతీమణి పద్మవల్లీదేవి, ఏలూరు జిల్లాకు చెందిన అనుచరులతో కలిసి కృష్ణా జిల్లా బొమ్ములూరు గ్రామానికి వచ్చారు. విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ, పుట్టగుంట సతీష్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పుట్టగుంట సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గత 18 ఏళ్లుగా భవానీ భక్తుల కోసం నిర్వహిస్తున్న నిరంతర అన్నదాన శిబిరాన్ని సందర్శించారు. అనంతరం కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి తన సతీమణి పద్మవల్లీదేవిని పోటీలో నిలపాలని భావిస్తున్న మాగంటి బాబు, ఆమె అభ్యర్థిత్వానికి సంబంధించిన పత్రాలను పుట్టగుంట సతీష్ కుమార్ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ పత్రాలను పార్టీ అధిష్ఠానానికి అందజేయనున్నట్లు మాగంటి బాబు తెలిపారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ జడ్పీ చైర్మన్ గద్దె అనురాధ గతంలో పుట్టగుంట సతీష్ కుమార్ చేతుల మీదుగా బీ-ఫారాలు అందుకోవడాన్ని సెంటిమెంట్‌గా భావిస్తున్నట్లు మాగంటి బాబు పేర్కొన్నట్లు సమాచారం. వారిద్దరి మాదిరిగానే తనకూ అదృష్టం కలగాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించి అభ్యర్థిత్వ పత్రాలను స్వీకరించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా, ఏలూరు జిల్లాలో సీనియర్ నాయకులైన మాగంటి బాబు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మధ్య రాజకీయంగా సమన్వయం సాధించేందుకు పుట్టగుంట సతీష్ కుమార్ కీలక పాత్ర పోషించనున్నారనే చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఇద్దరు నాయకులకూ ఆయన సన్నిహితుడు కావడంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సమాఖ్య మరింత గా ఎదగాలి :కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

**కృత్తివెన్ను,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్ శుక్రవారం హైటెక్స్ హైదరాబాదు నందు రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి సమాఖ్య యువ పారిశ్రామికవేత్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ యిర్రింకి సూర్యారావు తో కలిసి సూర్య మిత్ర స్టాళ్లను పరిశీలించి ప్రపంచంలో వివిధ దేశాలకు సూర్య మిత్ర సంస్థ ద్వారా రొయ్యల ఎగుమతి జరుగుతున్నదని కొన్ని వందల మందికి డాక్టర్ సూర్యారావు ఉపాధి కల్పిస్తున్నారని డాక్టర్ సూర్యరావుని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సంఘ సేవకుడు కొప్పినీడి సూర్యప్రకాష్,ఏపీ స్టేట్ ఆక్వా చైర్మన్




బీమాల శ్రీరామ్మూర్తి, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ఆరేటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రాలలో సరస్వతీ దేవి అలంకారంలో.... దుర్గమ్మ

● పిల్లలకు అక్షరాభ్యాసము చేయించిన బ్రహ్మంగారిమఠం పీఠాధిపతులు శ్రీ.శ్రీ.శ్రీ విరజానంద స్వామి ● భక్తులను విశేషంగా ఆకర్షించిన స్వామివారి ఆధ్యాత్మిక ప్రసంగం


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న శ్రీశ్రీశ్రీ విరజానంద స్వామి



**మైలవరం(చంద్రాల),అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రాల గ్రామంలో 50వ దేవీ నవ రాత్రుల సందర్భంగా శుక్రవారం కనక దుర్గమ్మ సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. జ్ఞానాన్ని, బుద్ధిని ప్రసాదించే చదువుల తల్లి సరస్వతీ దేవి రూపంలో అమ్మవారిని దర్శించు కోవడానికి విద్యార్థులు,భక్తులు భారీగా తరలి వచ్చారు.శుక్రవారం జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ అచంచలానంద ఆశ్రమము తోట్లపల్లి, బ్రహ్మంగారి మఠం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విరజానంద స్వామి విచ్చేసి పిల్లలకు అక్షరాభ్యా సము చేయించారు.అనంతరం హిందూ ధర్మం, ఆధ్యాత్మికత లోకంపోకడ మరియు ధర్మము ధర్మము గురించి పత్యేక ప్రసంగము చేశారు. స్వామివారి ఆధ్యాత్మిక ప్రసంగము భక్తులను విశేషముగా ఆకట్టుకుంది.సామూహిక లలితాపారాయ జరిగినది.శ్రీ విరజానంద స్వామి వారిని ఆశ్రమ పీఠాధిపతి తుమ్మల శ్రీరామమూర్తి సన్మానించారు.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

# ఆరేళ్లుగా కొనసాగుతున్న సరస్వతీ పూజా కార్యక్రమం



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** దసరా శరన్నవరాత్రులలో భాగంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కానుమోలు హైస్కూల్లో శుక్రవారం సరస్వతీ అమ్మవారి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత ఆరేళ్లుగా దాత లయన్ కళ్లేపల్లి నారాయణరావు, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, హాట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, లయన్ తాడి రంగారావు, లయన్ అక్కినేని రాఘవేంద్రరావు, దారపురెడ్డి భాస్కర్, రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివ రాయల్, మోగంటి వెంకటేశ్వరరావు, అంబళ్ల వెంకట రంగారావు, చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ దేవి అలంకారంలో కనకదుర్గమ్మ దర్శనం



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి గోత్రనామాలతో కుంకుమార్చన, అష్టోత్తర పుష్పార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు శ్రీనివాసరావు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాచినేని బాలకృష్ణ, ఝాన్సీ దంపతులు అమ్మవారికి నూతన వస్త్రాలను సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్, మాచినేని ప్రసాద్, లంక పద్మశ్రీ, లంక రజిని, కుసుమ, అరుణ, భవానితో పాటు పలువురు భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# మునిపేడ లో గ్రామ రీ సర్వే సభ



**కృత్తివెన్ను,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** మునిపెడ గ్రామపంచాయతీ కార్యాలయం నందు శుక్రవారం మునిపెడ గ్రామానికి సంబంధించి రీ సర్వే పూర్తి అయ్యి ఫైనల్ డి ల్ ర్ వచ్చి ఉన్నదీ సదరు విషయమై తాసిల్దార్ నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన మునిపెడ గ్రామపంచాయతీ నందు గ్రామసభ ఏర్పాటు చేయడమైనది గ్రామ సభయందు ఎ ఎమ్ ల వారీగా రైతుల పేర్లు , విస్తీర్ణములు చదివి వినిపించడం జరిగింది గ్రామసభ కు మండల సర్వేయర్ శ్రీనివాస్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గ్రామ రెవెన్యూ అధికారి శ్రీను గ్రామ సర్వేయర్లు, మరియు మాజీ నీటి సంఘం అధ్యక్షులు దాసరి ఆదినారాయణ.నీటి సంఘం అధ్యక్షులు తోట నాగబాబు సీనియర్ జనసేన నాయుకులు గంటా రాంబాబు కాకర బాలసోరి అలాగే గ్రామములో గల రైతులు పాల్గొన్నారు

## జవహర్ నగర్ లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి.



**జవహర్ నగర్, అక్టోబర్ 16(వార్తా ప్రభ):**మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని నాగారం మరియు జవహర్‌నగర్ డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, వీధిలైట్లు, సీసీ రోడ్లు, పారిశుధ్యం తదితర మౌలిక సమస్యలను పరిష్కరించే దిశగా మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య, మరియు బి.ఆర్.ఎస్. పార్టీ అధ్యక్షుడు బాష్వావోని కొండల్ ముదిరాజ్ తో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ని కలిసి మౌలిక సమస్యలను వివరించడం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ కి వినతి పత్రాలను అందజేసి కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా వివరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరడం జరిగింది.దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి, వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, అల్లూరి సంగీత రాజశేఖర్, పల్లపు రవి, మరియు బండి నవీన్ గౌడ్, తధితరులు పాల్గొన్నారు..

## పద్మానగర్ ఫేజ్-2లో వైభవంగా ముగిసిన అమ్మవారి నవరాత్రులు

**యువతను అభినందించిన భాగ్యలక్ష్మి**



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 16, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పద్మానగర్ ఫేజ్-2, రోడ్ నంబర్ 21లో జై భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పుట్ట భాగ్యలక్ష్మి మరియు యూత్ సభ్యులు అందరూ కలిసి భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తున్నారని, అందువల్ల యూత్ సభ్యులలో ఆ భక్తి భావం పెంపొంది అమ్మ చల్లని చూపు ఎప్పుడూ వీరిపై ఉంటుందని తెలిపారు. అలాగే ప్రతి హిందువులు తమ పిల్లలకు మన ఆచారాలు మరియు భక్తిని నేర్పించాలని, దీని వలన పిల్లలు భక్తి భావంతో ఉండి మంచి అలవాట్లు నేర్చుకొని అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉంటారని తెలిపారు. ప్రతి తల్లీదండ్రులు తమ పిల్లలకు మన దేవీదేవతల గురించి మరియు మన ఆచారాలు, వ్యవహారాలు నేర్పించి మన సమాజాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుట్ట అనిల్ కుమార్, ఆదిత్య, సిద్ధు, గణేష్, రేహన్, టోపి, సమీర్, గిరి, చోటు, రాము, ముషన్, సంజన, మెహెక్, చందు, జాను, గౌతమి, సురిల్, తేజ, ఝాన్సి, అంబిక, సంయుక్త, తస్వి తదితరులు పాల్గొని అమ్మవారి నవరాత్రులను విజయవంతం చేశారు.

## పద్మానగర్ ఫేజ్-2లో వైభవంగా బతుకమ్మ సంబురాలు.

**ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసిన మహిళలు**



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 16, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పద్మానగర్ ఫేజ్-2 పరిధిలోని రోడ్ నంబర్ 20 మరియు 5 లో గల 'భాగ్యలక్ష్మి నిలయం'లో బతుకమ్మ సంబురాలు అత్యంత ఘనంగా మరియు వైభవంగా నిర్వహించారు. భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్థానిక మహిళలు, ఆడపడుచులు ఎంతో ఉత్సాహంగా, ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, చుట్టూ చేరి ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో గౌరమ్మను కొలుస్తూ పాటలు పాడుతూ కోలాటాలు ఆడారు. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఈ బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవడం ద్వారా మన సంప్రదాయాలు, సంస్కృతి భావి తరాలకు అందుతాయని ఈ సందర్భంగా తెలిపారు. సాంప్రదాయ వస్త్రధారణతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకలను మరింత శోభాయమానంగా మార్చారు. ఈ బతుకమ్మ సంబురాల వేడుకల్లో భాగ్యలక్ష్మి, తేజస్విని, తస్వి, అంబిక, సంయుక్త, సంజన, మెహెక్, జాను, గౌతమి, సురిల్, తేజు, జాన్సి, ఆశిష్, జ్యోతి తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



నాగారం డివిజన్ రాంపల్లి లో శ్రీ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన నాగారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. **నాగారం, అక్టోబర్ 16(వార్తా ప్రభ)**

# పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలి

- విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలను ఉపసంహరించుకోవాలి.
- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి



**మహబూబాబాద్ జిల్లా (కురవి) అక్టోబర్ 16 (వార్తాప్రభ):** విపరీతంగా అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను వెంటనే నియంత్రించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కురవి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రకరకాల కారణాలతో నిత్యవసర వస్తువుల ధరలు కేవలం రెండు నెలల పరిధిలోని 13 శాతం పెరగడం మునుపెన్నడూ లేదని, ఈ ధరలు ఇంకా పైపైకే పోతున్నయని,దీనికి తోడు పండుగ స్పెషల్ అనే పేరుతో ఆర్టీసీ చార్జీలు విపరీతంగా పెంచారని, దీనితో పేద, మధ్యతరగతి ప్రజలు విలవిల లాడిపోతున్నారని అయినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నేరెత్తినట్టుగా వ్యవహరించడం ప్రభుత్వాల చేతకానితనానికి నిదర్శనమని ,ఎల్ నినో ప్రభావం చూపించి భవిష్యత్తులో ధరలు విపరీతంగా పెంచే అవకాశం ఉన్నందున బ్లాక్ మార్కెట్లో భారీ ఎత్తున ఉన్న నిల్వలను ఉశీచి కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచాలని వారిపై ఉక్కు పాదం మోపిలి ధరల నియంత్రణపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు

**-విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలను ఉపసంహరించుకోవాలి..**విద్యుత్ కొనుగోలు వ్యయాలు, ఆదాయా లోటు సాకుతో సామాన్య ప్రజలపై 5420 కోట్ల భారాన్ని మోపడం తగదని, నవంబర్ నుండి యూనిట్ కి 30 పైసలు, డిసెంబర్ నుండి 50 పైసలు చొప్పున వసూలు చేయాలని నిర్ణయించడం మూలిగే నక్కపై తాటిపండు పద్ద చందంగాలి సామాన్యులపై మోయలేని భారం వేయడమేనని, ఈ భారాన్ని వెనక్కి తీసుకోకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కన్వీనర్ బుడమ వెంకన్న,మండల సహాయ కార్యదర్శి కార్యదర్శి బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, దూదికట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య కలగూర నాగరాజు, నిలిగొండ నాగేశ్వరరావు కాట్యాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలోని ప్రజలందరికీ ఎల్లప్పుడు అండగా ఉంటా

- మడిపల్లి మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్కా మహబూబ్ రెడ్డి
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిల బాధ్యత కుటుంబానికి ఆర్థిక చేయూత..
- సర్పంచ్ ఇట్టే మాధవరెడ్డి ఉపసర్పంచ్ కొండ సతీష్ లు 50 కేజీల బియ్యం అందజేత



**తొర్రూరు అక్టోబర్ 16 (వార్తాప్రభ):** తొర్రూరు మండలంలోని ప్రజలకు ఎల్లప్పుడూ అండగా అందుబాటులో ఉంటానని.. సర్పంచ్ ఇట్టే మాధవరెడ్డి ఉపసర్పంచ్ కొండ సతీష్ లు కూడా 50 కేజీల బియ్యం అందజేయడం అభినందనీయమని.. ప్రతి ఒక్కరూ అవసరార్థులను ఆదుకునే సేవా గుణాన్ని అలవర్చుకోవాలని మడిపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు జక్కా మహబూబ్ రెడ్డి అన్నారు. మండలంలోని ఫతేపురం గ్రామానికి చెందిన డోర్నాల మురళి అనారోగ్య సమస్యతో పరమపదించగా శనివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మడిపల్లి గ్రామ మాజీ ఎంపిటిసి జక్కా మహబూబ్ రెడ్డి, జక్కా ఇంద్రసేన రెడ్డి వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి.. కుటుంబ సభ్యులను ఓదార్చి నిరుపేద కుటుంబం అయిన బాధితుని కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం, గ్రామ సర్పంచ్ ఇట్టే మాధవరెడ్డి 25 కేజీల బియ్యం, ఉపసర్పంచ్ కొండ సతీష్ 25 కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా జక్కా మహబూబ్ రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ ఉప సర్పంచ్ కూడా తోచినంత సహాయం చేయడం అభినందనీయమని ప్రతి ఒక్కరూ సేవ చేసే గుణాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రామ్ సింగ్, పల్లె సాయిలు, వెన్నం సోమిరెడ్డి, జమ్ముల యాకయ్య, ఇట్టే మహేందర్ రెడ్డి, జూకంటి వెంకన్న ,కుమ్మరి కుంట్ల వెంకన్న ,యర్రం రాజు యాదవ్, బోధ పెల్లి అన్వేష్, దేశ బోయిన కొమురయ్య, గ్రామ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు జంగం గణేష్, ఎర్రగొల్ల సుమంత్, గజ్జి సందీప్, సూరిబాబు గ్రామ ప్రజలు మహిళలు, యువకులు తదితరులు నివాళులర్పించారు.

# కెపిహెచ్‌బి లో పారిశుద్ధ కార్మికులకు దసరా కానుక

**నర్వ పవన్ ఫౌండేషన్ అధ్యర్యంలో చీరల పంపిణీ.**





**కూకట్ పల్లి,అక్టోబర్16(వార్తాప్రభ):**విజయ దశమి ( దసర) పండుగను పురస్కరించుకొని కెపిహెచ్‌బి కాలనీ నాలుగవ ఫేజ్‌లో నర్వ పవన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు నర్వ పవన్ మాట్లాడుతూ కాలనీ పరిశుభ్రత కోసం, ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికుల కష్టాన్ని గుర్తించి, పండుగ సంతోషాన్ని వారితో పంచుకోవడమే నిజమైన దసరా అని, తమ ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు పారిశుద్ధ్య కార్మికులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కామేశ్వరరావు, వెంకటరమణ యాదవ్, తోట రమేష్, యాదవ రెడ్డి, రేవతి, నాగలక్ష్మి, స్వర్ణ, హరిబాబు, నాగార్జున, మంచాల సాయి, అరుణ్, సురేంద్ర, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలి

**జూలూరుపాడు 400 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని పరిశీలించిన**

**టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**

**నాణ్యమైన విద్యుత్ సరఫరాకు నిరంతర పర్యవేక్షణ అవసరం**





**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రానున్న రోజుల్లో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టి, వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడు 400 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆయన పరిశీలించి, విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరును సమీక్షించారు.ఈ సందర్భంగా విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా సామర్థ్యం, రానున్న సీజన్‌లో పెరిగే విద్యుత్ లోడ్‌ను తట్టుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర కీలక విద్యుత్ పరికరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తే అవకాశాలను ముందుగానే గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీఎండీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం ఎస్ఈ జి. మహేందర్, కొత్తగూడెం డీఈతో పాటు పలువురు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# చిరకాల మిత్రుల ఆత్మీయ కలయిక



**హైదరాబాద్, అక్టోబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రకాశం జిల్లా, అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులైన సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, ఏపీఆర్‌జేసీ విశ్రాంత ఉపాధ్యాయులు దోగుపర్తి శ్రీనివాసరావు నేడు హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఆత్మీయంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా చిన్ననాటి మధుర జ్ఞాపకాలను, పాఠశాల రోజుల్లోని అనుభవాలను నెమరువేసుకుంటూ కొంతసేపు ఆనందంగా ముచ్చటించుకున్నారు. కాలం గడిచినా, జీవిత ప్రయాణంలో ఎవరికి వారు వేర్వేరు మార్గాల్లో పయనించినా, చిన్ననాటి స్నేహబంధం మాత్రం చెక్కుచెదరదని ఈ చిరకాల మిత్రుల కలయిక మరోసారి చాటిచెప్పింది.

# హైదరాబాద్

## యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వాలంటీర్లకు గౌరవ వేతనాల అందజేత



**పెద్దపల్లి, అక్టోబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి):**యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో గత 15నెలలుగా సేవలందిస్తున్న వాలంటీర్లకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా గౌరవ వేతనాలు అందజేశారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించడంలో వాలంటీర్ల పాత్ర ఎంతో కీలకమని, సేవాభావంతో పనిచేసే వారికి ప్రోత్సాహం అందించడం సామాజిక బాధ్యత అని యాదవ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే పేద, నిరుపేద రోగులకు సహాయం అందిస్తూ, వైద్య సేవలు సులభంగా పొందేందుకు వాలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.సమాజ సేవే లక్ష్యంగా యాదవ చారిటబుల్ ట్రస్ట్ వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ప్రజలకు అవసరమైన సందర్భాల్లో తన వంతు సహకారం అందించేందుకు ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందిస్తున్న వాలంటీర్లకు గౌరవ వేతనాలు అందించడం ద్వారా వారి సేవలను గుర్తించి, మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు ప్రోత్సహించడం తమ ఉద్దేశమని వివరించారు.ఈ కార్యక్రమంలో యాదవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ మారం తిరుపతి యాదవ్, ట్రస్టీ సామ తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్, చంద్రపురి కాలనీ కాంగ్రెస్ డివిజన్ కమిటీల ప్రకటన

**తోటకూర వజ్రేష్ యాదవ్**





**జవహర్ నగర్, అక్టోబర్ 16(వార్తా ప్రభ):**మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని జవహర్ నగర్, చంద్రపురి కాలనీల కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయి కమిటీలను మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రకటించారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.పదవులు బాధ్యతకు ప్రతీకలు.. ప్రజాసేవే లక్ష్యం.. కాంగ్రెస్ విజయమే ధ్యేయం! అని పేర్కొంటూ, నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్, చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పల్లె సత్యం వంశరాజ్, గజ్వేల్ శంకర్, బొబ్బిలి మంజుల, వీర్ల భుజంగం, విజయరాయ్ మరియు ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి.

**-పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి.**

**ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన పాలకుర్తి ఎస్హెచ్ఓ ఊర సృజన్ కుమార్.**



**పాలకుర్తి అక్టోబర్ 16 (వార్తాప్రభ):** పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పాల కుర్తి నియోజకవర్గం మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. పాలకుర్తి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన ఊర సృజన్ కుమార్ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చిన ప్రతి ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని మండలాన్ని శాంతిభద్రతలకు నిలయంగా మార్చాలని అన్నారు. శాంతి భద్రతలకు అవరోధం కల్పించిన వారిని విడిచిపెట్టొద్దని.. నిషేధిత గుడుంబా గాంజా తదితర వ్యాపారాలు చేస్తున్న వారిని కట్టడి చేయాలని... శాంతి భద్రతలకు మారుపేరు పాలకుర్తి మండలం గా తీర్చిదిద్దాలని సూచించారు.

# సంపాదకీయం

## బీజేపీ డీలిమిటేషన్ బిల్లుకు వైసీపీ మద్దతు ఇస్తుందా ?

రాజకీయం దేశంలో మారుతోంది. ఏపీలోనూ వైసీపీ కొత్త రాగం అందుకుంటున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి డీలిమిటేషన్ బిల్లు మహిళా బిల్లు రిజర్వేషన్లను ఆమోదించుకునేందుకు రంగం సిద్ధం చేస్తోంది అని వార్తలు వినిపిస్తున్నాయి. దాని కోసం ఈ నెలాఖరులోనే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించే అవకాశం ఉందని జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ప్రత్యేక సమావేశాల ద్వారా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన కీలక బిల్లులను ఆమోదించుకోవడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతోంది. ఇక బీజేపీ వరకూ చూస్తే ఈ రెండు బిల్లులను ఆమోదించుకోవడం చాలా కీలకంగా కనిపిస్తోంది. మహిళా రిజర్వేషన్ల చట్టం నారీ శక్తి వందన్ అధినియం పేరుతో 2023లోనే ఆమోదం పొందినప్పటికీ దాని అమలును జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టారు. అయితే ప్రస్తుత ప్రతిపాదన ప్రకారం 2011 జనాభా లెక్కల ఆధారంగానే డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేసి 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అలాగే కొత్త నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ద్వారా లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుండి 816 లేదా 850 వరకు పెంచే అవకాశం ఉందని అంటున్నారు. ఈ లెక్కన పెరిగే దాదాపు 273 స్థానాలు మహిళలకు రిజర్వ్ చేయబడతాయని ప్రచారం సాగుతోంది. అందుకే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు అని తెలుస్తోంది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 17న జరిగిన ప్రత్యేక సమావేశాల్లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ లభించకపోవడంతో ఈ బిల్లులు వీగిపోయాయి. ఆ తర్వాత జరిగిన వర్షాకాల సమావేశాలు కూడా ప్రతిపక్షాల నిరసనల కారణంగా ఎలాంటి చర్చ లేకుండానే ముగిశాయి. ఇలా బీజేపీకి విపక్షాలు భారీ షాక్ ని ఇచ్చాయి. ఈసారి అలాంటి పరిస్థితులు సంభవించకుండా బీజేపీ అయితే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈసారి బిల్లులను ఎలాగైనా ఆమోదింపజేసుకోవడానికి తమ వద్ద తగిన సంఖ్యాబలం ఉందని బీజేపీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఓటింగ్ అనివార్యమైతే ప్రత్యేక మెజారిటీ సాధించేందుకు ఎన్డీయే ప్రభుత్వం డీఎంకే వంటి ప్రాంతీయ పార్టీలతో పాటు కొన్ని చిన్న ప్రతిపక్ష పార్టీలతో కూడా సంప్రదింపులు జరుపుతోంది అని అంటున్నారు. మరి ఈ సమయంలో వైసీపీ వైఖరి ఏమిటి అన్నది కీలకంగా భావిస్తున్నారు. వైసీపీ ఈ ఏడాది ఏప్రిల్ 17న జరిగిన ఓటింగులో మద్దతు ఇచ్చింది. కానీ ఇపుడు కేంద్ర ఎన్నికల సంఘం విషయంలో ఇండియా కూటమి పక్షాలకు అనుగుణంగా మాట్లాడుతోంది. అంతే కాదు 2023లో కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకాలకు సంబంధించి చేసిన చట్ట సవరణను వెనక్కి తీసుకుని పాత విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఒక విధంగా వైసీపీ గొంతు మారింది. ఈ నేపథ్యంలో వైసీపీ మద్దతు ఈ రెండు బిల్లులకు ఉంటాయా అన్నది చర్చగా ఉంది. అయితే అభివృద్ధికి సంబంధించిన అంశాలు దేశ ప్రయోజనాలు విస్తృతమైన విషయాలలో మద్దతు ఇస్తామని వైసీపీ ఎపుడూ చెబుతూ ఉంటుంది. ఆ విధంగా చూస్తే వైసీపీ ఆమోదం ఉండవచ్చు అన్నది మరో చర్చ. చూడాలి మరి ఏమి జరుగుతుందో

## పశ్చిమ 54వ డివిజన్ కార్పొరేటర్ వైసీపీ అభ్యర్థిగా శీరంశెట్టి పూర్ణ నామినేషన్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 16 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 54 డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా శీరంశెట్టి పూర్ణచంద్రరావు నామినేషన్ వేశారు. తన కార్యాలయం నుండి విఘ్నేశ్వర దేవాలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొని ఆశీస్సులు తీసుకొని మరియు సి ఎస్ ఐ చర్చిలో ప్రార్ధనలు చేసి ఆశీస్సులు తీసుకొని డివిజన్లో వైఎస్ఆర్సిపి నాయకు లతో కలిసి పాదయాత్రగా వెళ్లి వార్డుసచివాలయంలో రిటర్నింగ్ అధికారి అంజయ్య కి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్సిపి కార్యదర్శి మైనారిటీ బాజీ బాబా, క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బాలరాజు రమేష్ రాజు, సుభాని ఖాన్, దుర్గాభవాని మార్క్, గాలిబ్, చిట్టు జీవన్ మోసిన్, రాజశేఖర్, సోమినాయుడు, ప్రకాష్, ఎలకల బాబు, నాగరాజు, వెంకటలక్ష్మి, స్రవంతి, మోహన్ విజయ్, ఏసు పాదం, భూపతి శ్రీనివాస్, తిరుమల తదితర వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## 50 వైసీపీ కుటుంబాలు జనసేన పార్టీ లో చేరిక



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 16 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ముఖ్య నేత, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సారథ్యంలో వైఎస్సార్‌సీపీ కి చెందిన తమ్మిన పరమేశ్వరి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు పైగా జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి వచ్చిన వారికి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను జనసేన కండువా కప్పి పార్టీలోకి ఘనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, క్రియాశీల కార్యకర్తలు మరియు వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ ఉ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల సమన్వయకర్త బాడిత శంకర్ తెలిపారు.

# శ్రీ కాత్యాయనీ దేవీ రూపంలో దర్శనమిచ్చిన శ్రీ దేవీ కరుమారి అమ్మన్ వారు





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దసరా మహోత్సవాల్లో భాగంగా సందర్భంగా మూలా నక్షత్రం శుక్రవారం ఆరోవ రోజుశ్రీ దేవి కరుమారి అమ్మ వారు శ్రీ కాత్యాయని దేవి రూపం లో దర్శనం ఇచ్చారు. శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో ""'ధ్యానమ్‌చంద్రహాసోజ్జ్వలకరా శార్దూలవరవాహనాకాత్యాయనీ శుభం దద్యాద్దేవీ దానవఘాతినీ మంత్ర జపంతో అమ్మవారి సన్నిధిలో హోమాలు నిర్వహించారు. శ్రీ దసరా శరన్నవరాత్రి మహోత్సవం-2026 లో భాగంగా మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలో సీ వీ ఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో దసరా వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆరో రోజు శ్రీ దేవి కరుమారి అమ్మ వారుశ్రీ కాత్యాయని దేవి రూపం లో దర్శనం ఇచ్చారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక హోమం నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలతో పాటుగా సామూహిక కుంకుమార్చన చేశారు. పీఠదిపతి శ్రీశ్రీశ్రీ కరుణానందనాథ స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. అమ్మవారి సన్నిధి లోని కళా వేదికపై చిన్నారులతో నిర్వహించిన సంప్రదాయ నృత్యం భక్తులను ఆకట్టుకొన్నాయి అమ్మవారి ఆలయానికి, భక్తుల కోసం ఏర్పాటు చేసిన విధ్యుత్ స్వాగత తోరణాలు భక్తులను ఆకట్టుకొన్నాయి. శుక్రవారం రాత్రి జరిగిన అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపు లో వందలాది మహిళా భక్తులు పాల్గొన్నారు.

# పోటీ అంటే వణికిపోతున్న కూటమి ప్రభుత్వం

### ఎంపీ మిథున్ రెడ్డిపై దాడి దారుణం
### వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతివృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు తోలేటి శ్రీకాంత్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 16 :(వార్త ప్రభ ప్రతినిధి)** పుంగనూరులో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజే ఎంపీ మిథున్ రెడ్డి తో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై టీడీపీ కూటమి నాయకులు దాడులకు పాల్పడటం, అరాచకాలకు తెగబడటం అత్యంత దారుణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతివృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు తోలేటి శ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో గట్టి బుద్ధి చెబుతారనే భయంతోనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజు నుంచే దాడులు, బెదిరింపులకు దిగుతున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆశించిన సంక్షేమ పథకాలు అందక ప్రజలు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం, రాజకీయ ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల్లో పైచేయి సాధించాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఎన్ని బెదిరింపులకు పాల్పడినా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని తోలేటి శ్రీకాంత్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మద్దతు ఉన్న పార్టీని దాడులతోనూ, దౌర్జన్యాలతోనూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. పుంగనూరులో జరిగిన దాడులపై పోలీసుల వ్యవహారశైలిపైనా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. దాడులకు సంబంధించిన వాస్తవాలను నిష్పక్షపాతంగా విచారించి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులతో పాటు ఎన్నికల అధికారులపై కూడా ఉందని ఆయన గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట కేంద్ర బలగాల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎంపీ మిథున్ రెడ్డి తో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడులకు పాల్పడిన వారిని తక్షణమే గుర్తించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తోలేటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల తీర్పును ఎదుర్కోవాల్సిన రాజకీయ పార్టీలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

# హస్తకళల ప్రదర్శనకు విశేష స్పందన

### దేశవ్యాప్తంగా సంప్రదాయ కళారూపాలు, చేనేత ఉత్పత్తులకు ఆదరణ
### కళాకారులకు మార్కెటింగ్ వేదికగా లేపాక్షి గాంధీ శిల్ప బజార్









**విజయవాడ: అక్టోబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సంప్రదాయ హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించడంతో పాటు కళాకారులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప బజార్‌కు విశేష స్పందన లభిస్తోంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు రూపొందించిన విభిన్న హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. దసరా పండుగ నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన సంప్రదాయ కళలు, చేనేత ఉత్పత్తుల విక్రయాలకు విలువైన వేదికగా నిలుస్తోంది. విజయవాడ ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో పంటకాలవ రోడ్డు మారిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన 18వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రతిరోజూఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది హస్తకళాకారులు, చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారీ కళారూపాలు, చెక్క శిల్పాలు, టెర్రకోట ఉత్పత్తులు, తోలుబొమ్మలు, క్రోషియా లేస్, ఇమిటేషన్ ఆభరణాలు, వెంకటగిరి చీరలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. తెలంగాణ లక్క బంగిళ్లు, పోచంపల్లి ఇకత్ చీరలు, కర్ణాటక చన్నపట్నం బొమ్మలు, కొల్హాపురి చెప్పులు, ఉత్తరప్రదేశ్ జరీ, చికన్‌కారీ వస్త్రాలు, అస్సాం వెదురు, కేన్ ఉత్పత్తులు సహా పలు ప్రాంతాల ప్రత్యేక కళాకృతులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. కళాకారులు తమ చేతులతో రూపొందించిన ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం ఈ ప్రదర్శన ద్వారా లభిస్తోంది. దీనివల్ల వారి ఉత్పత్తులకు మార్కెట్ విస్తరించడంతో పాటు ఆదాయ అవకాశాలు మెరుగుపడుతున్నాయి. మరోవైపు, వినియోగదారులు వివిధ ప్రాంతాల సంప్రదాయ కళలు, చేనేత ఉత్పత్తులను ఒకే వేదికపై వీక్షించి కొనుగోలు చేయగలుగుతున్నారు. హస్తకళాకారులకు శిక్షణ, డిజైన్ అభివృద్ధి, ఆధునిక పనిముట్ల పంపిణీతో పాటు మార్కెటింగ్ అవకాశాల కల్పనకు లేపాక్షి ప్రాధాన్యం ఇస్తోంది. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ - లేపాక్షి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ, సంప్రదాయ హస్తకళలు, చేనేత రంగాల అభివృద్ధికి ఇటువంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. కళాకారులు తమ నైపుణ్యంతో రూపొందించిన ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచవచ్చన్నారు. భారతీయ సంప్రదాయ కళా వైభవాన్ని భావితరాలకు అందించడంతో పాటు కళాకారులను ప్రోత్సహించేందుకు లేపాక్షి నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలు ఈ ప్రదర్శనను సందర్శించి హస్తకళలు, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులకు ప్రోత్సాహం అందించాలని హరి ప్రసాద్ కోరారు.

# కే బి ఎన్ కళాశాల ప్రాంగణంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 16 :(వార్త ప్రభ ప్రతినిధి)** కేబీఎన్ కాలేజీ ప్రాంగణంలోని దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి సరస్వతీ అలంకారంతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. సరస్వతీ సూక్త సంపుటితో ప్రత్యేకంగా చండీ సప్తశతి హోమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సరస్వతి పూజలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరందరికీ సరస్వతీ పూజ చేసిన పుస్తకాలు వెన్నులను కళాశాల సెక్రటరీ డాక్టర్ టి శ్రీనివాస్ పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో 300 మందికి పైగా ముత్తయిదుగుల పాల్గొని లలితా సహస్రనామ స్తోత్రంతో కుంకుమార్చన నిర్వహించారు. హిందూ హైస్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య, ట్రెజరర్ బాబా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతి దేవీ అలంకారం లో దర్శనమిచ్చిన శ్రీ నగరాల మహాలక్ష్మి అమ్మవారు

### మూలా నక్షత్రం సందర్భంగా పోటెత్తిన మహిళా భక్తులు






**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 16 :(వార్త ప్రభ ప్రతినిధి)** సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల (కొత్తఅమ్మవారు) దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. చిట్టినగర్ శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీమహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నందు దసరా శరన్నవరాత్రులు ఉత్సవాల్లో మూలా నక్షత్రం భాగంగా 6వ రోజు అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం చేసుకున్నారు. సుమారుగా 6000 మంది భక్తులు అమ్మవారు కుంకుమ పూజ చేసుకొని భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వేకరించారు. వంగవీటి రంగా కుమార్తె ఆశ కిరణ్ శ్రీ నగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ ఫౌండర్ అధ్యక్షులు నాగోతి వెంకటేశ్వరరావు( ఎన్ వీ రావు ) గుజ్జారి అమర్ కుటుంబ సభ్యులతో హాజరై పసుపు కుంకుమలు సారె ఇచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి సేవలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వచ్చిన ప్రతి భక్తులకి ప్రసాదం పంపిణీ చేశారు. ప్రతిరోజు సాయంత్రం నృత్య ప్రదర్శన కార్యక్రమం చేయడం జరుగుతుంది వారికి సర్టిఫికెట్స్ గిఫ్ట్ దేవస్థానం నుంచి ఇవ్వడం జరుగుతుంది. సాయంత్రం అమ్మవారి కి పంచ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పోతిన బేసు కంఠేశ్వరుడు సెక్రటరీ తొత్తడి భరత్, కోశాధికారి బెవర సాయి సుధాకర్, పణుకు రమా, కత్తెర సురేష్, శీరం వెంకట్రావు, ఇద్దిపిల్లి దేవీ మరుపిళ్ళ ప్రసాద్ పవన్ కుమార్, రాంపిళ్ళ వాసు, బాయిన బెనర్జీ, పొట్నూరి శివ, నాగేశ్వరరావు, గూడేల మణికంఠ, మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మేయర్, వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

### అక్టోబర్ 16 నుంచి 18 వరకు నామినేషన్ల స్వీకరణ



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 16 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన నోటీసు బోర్డులో శుక్రవారం ఉదయం మేయర్ ఎన్నికకు సంబంధించి రిటర్నింగ్ ఆఫీసర్, పీడీ హౌసింగ్ రజిని కుమారి పబ్లికేషన్ నోటీసును జారీ చేశారు. రెండవ సాధారణ పురపాలక ఎన్నికల నేపథ్యంలో మేయర్ ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అక్టోబర్ 16 నుంచి 18వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలో నామినేషన్ ఫారాలను పొంది, నిర్దేశించిన గడువులోగా సమర్పించవచ్చని తెలిపారు. అదేవిధంగా, వివిధ వార్డులకు సంబంధించిన రిటర్నింగ్ ఆఫీసర్లు తమ తమ వార్డుల్లో పబ్లికేషన్ నోటీసులను జారీ చేసి వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2026 అక్టోబర్ 28వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ పబ్లికేషన్లో అకౌంటెంట్ బొమ్మిడి శ్రీనివాస్, వివిధ వార్డుల రిటర్నింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సరస్వతీ దేవి అలంకరణ-సామూహిక సహస్రనామ



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16(వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని కీలేసుపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ శగంగానమ్మ అమ్మవారి దేవస్థానం లో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లల చేత సరస్వతీ పూజ సామూహిక సహస్రనామ నిర్వహించారు. దంపతులు చేత కుంకుమ పూజ, సరస్వతి హోమం జరిపించారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## నైరాశ్యమే అమావాస్య

మితిమీరిన నైరాశ్యము
హరించును సంతోషము
బయటి పడితే మంచిది
నిజంగా అవసరమది
రాతిలాంటి కాఠిన్యము
తెంచుతుంది బంధాలు
ఉండదోయ్! కారుణ్యము
చేయును మనసు ముక్కలు
ఉత్తమం ఔదార్యము
తెచ్చిపెట్టు గౌరవము
జీవితాన మణిదీపము
అదేనోయ్! కంఠహారము
చెరుపుతుంది లోభత్వము
సృష్టించునుఅయోమయము



తరిమికొడితే బహు మేలు
బ్రతుకులోన పదివేలు

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి.**



**మచిలీపట్నం అక్టోబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మచిలీపట్నం నగరంలోని పలు డివిజన్ల పరిధిలో స్వర్ణ వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను, నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన దరఖాస్తు ఫారాలు, చెక్‌లిస్టులు, డిజిటల్ గడియారం ఏర్పాటు, ఇతర సామగ్రి అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. నామినేషన్ పత్రాల్లో అభ్యర్థులు పొందుపరిచిన వివరాలు, సంతకాలు, జతచేయాల్సిన ధ్రువపత్రాలు, డిపాజిట్ చెల్లింపు తదితర అంశాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసి నామినేషన్లను స్వీకరించాలని సూచించారు. స్వీకరించిన ప్రతి నామినేషన్‌కు సంబంధించిన వివరాలను ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అదే రోజు నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొత్తాన్ని తప్పనిసరిగా వీడియో చిత్రీకరణ చేయాలని, నామినేషన్ల స్వీకరణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన సమయాన్ని కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నామినేషన్ల స్వీకరణలో ఏవైనా లోపాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## పార్టీ విధేయతకు అవకాశం కల్పించండి

**ఎంపీపీ బరిలో గరికపాటి శివ సతీమణి గరికపాటి రేష్మ**

**అవకాశం కల్పిస్తే ఎమ్మెల్యే వసంత మార్క్ పాలన**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16(వార్తా ప్రభ ప్రతినిధి)** :ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నారు తెలుగుదేశం పార్టీ విధేయులలో అత్యంత ముఖ్యమైన వ్యక్తి ,ఇబ్రహీంపట్నం మండల కస్టర్ ఇంచార్జి మరియు తెలుగు యువత అధ్యక్షుడు గరికపాటి శివ. ఆయన సతీమణి గరికపాటి రేష్మ పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రజాసేవ చేయడానికి, ప్రజలకు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మార్క్ పాలన మరింత చేరువ చేయడానికి ఇబ్రహీంపట్నం ఎంపీపీ గా అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే వసంత కు అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు శివ. పార్టీ ప్రతిపక్షంలో ఉండి కష్టకాలంలో ఉన్నప్పుడు ఎంపీటీసీగా బరిలో నిలిచారు. ప్రతిపక్షంలో సైతం పార్టీ విధేయుడిగా, పార్టీ కార్యక్రమాలు క్రియాశీలక పాత్ర పోషిస్తూ పార్టీని ముందుకు నడిపించిన తీరు అప్పటి తెలుగుదేశం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. 24 ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ అందిస్తున్న సంక్షేమం అభివృద్ధి ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఎంపీపీ బరిలో పోటీ చేసేందుకు సామాజిక, ప్రజా బలంతో గరికిపాటి శివ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.

## మూలా నక్షత్రం సందర్భంగా కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు విస్తృత సౌకర్యాలు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 16 :(వార్త ప్రభ ప్రతినిధి)** మూలా నక్షత్రం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు విస్తృత స్థాయిలో తాగునీరు, ఆహార పదార్థాలు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచుతూ, భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. మూలా నక్షత్రం సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో వారికి స్వచ్ఛమైన తాగునీటిని విస్తృతంగా అందిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇందులో భాగంగా 2026 అక్టోబర్ 16వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు 25 లక్షల వాటర్ బాటిళ్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కేవలం మూలా నక్షత్రం రోజైన అక్టోబర్ 16వ తేదీన ఉదయం 12 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మొత్తం 3.5 లక్షల వాటర్ బాటిళ్లను భక్తులకు పంపిణీ చేసినట్లు కమిషనర్ తెలిపారు. భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండే హోల్డింగ్ ఏరియాల్లో ప్రత్యేకంగా తాగునీటి సౌకర్యాలను అందుబాటులో ఉంచడంతో పాటు, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైన సౌకర్యాలు నిరంతరాయంగా అందేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. లక్షలాది మంది భక్తులు ఒకేసారి నగరానికి తరలివచ్చే నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతకు విజయవాడ నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని కమిషనర్ తెలిపారు. భక్తులు సంచరించే మార్గాలు, హోల్డింగ్ ఏరియాలు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ చేపడుతూ, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. పారిశుధ్య సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటూ పరిసరాల పరిశుభ్రతను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు తాగునీరు, అవసరమైన ఆహార పదార్థాలు, పరిశుభ్రమైన పరిసరాలు, ఇతర మౌలిక వసతులు సమకూర్చడం ద్వారా వారి యాత్ర సౌకర్యవంతంగా సాగేలా విజయవాడ నగరపాలక సంస్థ సమన్వయంతో సేవలందిస్తోందని కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు.

## ఎంఆర్‌పీఎస్ కాప్రా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన బట్టల పరమేశ్వర్‌కు సన్మానం



**జవహర్ నగర్, అక్టోబర్ 16(వార్తా ప్రభ):**కాప్రా మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా ఎన్నికైన రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన బట్టల పరమేశ్వర్‌ను పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ.. తనను సన్మానించిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ ఆశయ సాధనకు కృషి చేస్తానని, మాదిగల హక్కుల సాధన కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బూడిద నరేందర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తూటి శ్రీనివాస్, అంబాల విష్ణు, జినుక రఘు, దుర్గేష్, అనిల్, విశాల్, నరేష్, నానీ, ప్రవీణ్, సూరి తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు, కర్నాటక రౌడీలతో ఏపీలో ఎంపీ మిథున్ రెడ్డి అల్లర్లు

● రాయలసీమలో వైసీపీ హింసాత్మక ఘటనలపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఆధ్వర్యంలో ఎస్ఈసీకి ఫిర్యాదు ● వైసీపీ చేసిన విధ్వంసంపై ఎస్ఈసీకి సవివరంగా వివరించిన వర్ల రామయ్య, పర్చూరి అశోక్ బాబు, కుప్పం రాజశేఖర్ ● వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి గూండాలతో దాడికి తెగబడ్డ వీడియోల పెన్ డ్రైవ్ ను ఎస్ఈసీకి అందజేసిన టీడీపీ నేతలు ● ఏపీలో కుట్రలు సృష్టించి, శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకు జగన్ రెడ్డి ప్లాన్ ● పుంగనూరులో అన్ని కార్లతో ఎంపీ మిథున్ రెడ్డి నామినేషన్ వేయడానికి రావడమేంటి? ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాదా? ● టీడీపీ కార్యకర్తలను మిథున్ రెడ్డి కార్లతో తొక్కించి దాడులు చేసిన వైసీపీ గ్యాంగ్ ● టీడీపీ ఎమ్మెల్సీ వర్ల రామయ్య





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 16 :(వార్త ప్రభ ప్రతినిధి)** పోటీ చేసిన ఎక్కడా గెలవలేమన్న నిరాశ నిస్పృహలతో రాష్ట్రంలో జగన్ రెడ్డి, పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డి పథకం ప్రకారమే గొడవలు సృష్టించేందుకు కుట్రలు చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రెండు కార్లతో వెళ్లి నామినేషన్ వేయాల్సిన వ్యక్తి... 32 కార్లతో రౌడీలను తీసుకొచ్చి ర్యాలీగా నామినేషన్ వేసేందుకు ఎందుకు వచ్చాడు. అధికారులే భయపడిపోయారు. ఎంపీకి ఏం సంబంధం. మిథున్ రెడ్డి, గొడ్డలి పార్టీ నాయకులు రాజకీయ నాయకుడిలా కాకుండా రౌడీల్లా వ్యవహరిస్తున్నారు. బందిపోటుల్లా ప్రవర్తిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు 2021లో చేసిన అరాచకాలను ఇప్పుడు చేయలనుకుంటున్నారా?. తిరుత్తణి, కాట్పాడి, తమిళనాడు నుంచి రౌడీ షీటర్లను తీసుకొచ్చి గొడవలు సృష్టించారు. బెంగళూరు నుంచి రౌడీలను తీసుకొచ్చి టీడీపీ నాయకులపై దాడులు చేశారు. బెంగళూరులో సగం ఆస్తులు పెద్దిరెడ్డి బ్యాచ్‌వే. ఎప్పుడు చూడని మొఖాలు పుంగనూరులో ఈ రోజు కనిపించాయి. ఎన్నికల సంఘానికి వీడియోలు చూపించాం. పోలీసుల చేత వీడియోలో ఉన్న వారిని విచారణ జరిపించాలని కోరాం. పుంగనూరు ఎన్నికల్లో తమిళనాడు, కర్నాటక రౌడీలకు ఏం పని?. మిథున్ రెడ్డి రౌడీలతో దౌర్జన్యం చేయడంతో ఆర్వో కూడా బయపడి బయటకు వచ్చేశాడు. దౌర్జన్యం చేసి గెలవాలని గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. ఒక్క సీటు కూడా వైసీపీ గెలవలేదు. మద్యం కేసు, వివేకా హత్య కేసు, జగన్ కేసులను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. వైసీపీకి ప్రజలు ఓటు వేసే పరిస్థితులు లేవు. దౌర్జన్యం చేసేందుకు గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తే తగిన ముల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. చట్టబద్దంగా వెళ్దాం, రౌడీయిజంతో గెలవాలని చూస్తే అది జరగదు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతాయి. జగన్ రెడ్డి కోరుకున్నట్టు అరాచకం చేస్తే వ్యవస్థలు చూస్తూ ఊరుకోవు తాట తీస్తాయని వైకాపా నాయకులు గ్రహించాలి. ఇలాగే వ్యవహరిస్తే ఎంపీ మిథున్ రెడ్డిని ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని వర్ల రామయ్య హెచ్చరించారు. ఈ ఎస్ఈసీకి ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ కుప్పం రాజశేఖర్ కూడా ఉన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన, కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి

● ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను ● విజయవాడ స్థానిక సంస్థల ఎన్నికల పార్లమెంటు సమన్వయకర్త వంగవీటి రాధాకృష్ణ



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 16 :(వార్త ప్రభ ప్రతినిధి)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయవాడ నగర మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ మేయర్ మరియు కార్పొరేటర్ అభ్యర్థులతో పాటుగా కూటమి అభ్యర్థుల విజయానికి జనసైనికులు, వీర మహిళలు సమన్వయంతో, అంకితభావంతో కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను, విజయవాడ స్థానిక సంస్థల ఎన్నికల పార్లమెంటు సమన్వయకర్త వంగవీటి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. బిఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనసేన పార్టీ శ్రేణులు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ, పార్టీ ఆశయాలను, కూటమి లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుని, ప్రజలకు అందుబాటులో ఉండాలని వారు పిలుపునిచ్చారు. బిజనసేన పార్టీకి బలమున్న ప్రతి ప్రాంతంలో అభ్యర్థుల ఎంపికకు ప్రాధాన్యత ఉంటుందని వారు స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ఎన్నికల ప్రచారం వరకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తూ, కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ దుర్గా మల్లేశ్వరుల దివ్య నగరోత్సవం

**కొండపై వీణాపాణియై శ్రీ సరస్వతీ దేవిగా చదువుల తల్లి అలంకారం**

**ప్రదోషవేళ కనులపండువగా ఆదిదంపతుల పల్లకీయాత్ర**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 16 :(వార్త ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో ఆరవ రోజు, అమ్మవారి జన్మనక్షత్రమైన పరమ పవిత్ర మూలా నక్షత్రం పర్వదినాన శుక్రవారం సాయంత్రం ఆదిదంపతులైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దివ్య నగరోత్సవం భక్తుల జయజయధ్వానాల నడుమ ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవోపేతంగా జరిగింది. ?ఇంద్రకీలాద్రి శిఖరాన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారు శ్వేతాంబరియై, వీణాపాణిగా సాక్షాత్తు జ్ఞానప్రదాయిని శ్రీ సరస్వతీ దేవి దివ్యాలంకారంలో భక్తులకు కరుణామృత దృష్టితో దర్శనమిస్తుండగా, పరమ పవిత్రమైన ప్రదోషకాల సమయంలో కొండపై కొలువుదీరిన శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా విశేష పూజలు, దివ్య మంగళ హారతులు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నగరోత్సవం అత్యంత కోలాహలంగా ప్రారంభమైంది. ?నగరోత్సవ రథం ముందుకు కదులుతుండగా సుమధుర శాక్సోఫోన్ వాయిద్యాలు, సంప్రదాయ కేరళ పంచవాద్యాల దరువులు, గుస్సాడీ కళావిన్యాసాలు మరియు మహిళా భక్తుల లయాన్విత కోలాటాలు వీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిధ్వనింపజేశాయి. శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు రథం సెంటర్, వన్ టౌన్ వినాయక గుడి, కెనాల్ రోడ్డు, పవిత్ర కృష్ణా నదీ తీరాన ఉన్న దుర్గా ఘాట్ మీదుగా ఘాట్ రోడ్డు ద్వారా సాగింది. వేలాది మంది భక్తులు పాదయాత్రగా నగరోత్సవం వెంట నడుస్తూ "జై భవానీ.. జై జై భవానీ", "ఓం శ్రీ మాత్రే నమః" అంటూ చేసిన జయజయధ్వానాలతో ఇంద్రకీలాద్రి పరిసరాలు మార్మోగాయి. సర్వాంగసుందరంగా విద్యుద్దీపాలు, సుగంధ పుష్పాలతో ముస్తాబు చేసిన రథంపై కొలువుదీరిన ఆదిదంపతులను దర్శించుకునేందుకు పురవీధుల్లో భక్తజనం బారులు తీరారు. మార్గమధ్యంలో భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ, కొబ్బరికాయలు కొడుతూ స్వామి, అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ఘన నీరాజనాలు పలికారు. ?నగరోత్సవం ఘనంగా కొండపైకి చేరుకున్న అనంతరం ఆలయ మహారాజగోపురం ఎదుట సంప్రదాయబద్ధంగా "ఆస్థాన కార్యక్రమం" నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక బృందం ఉత్సవ మూర్తులకు వేదోక్తంగా శాస్త్రోక్త పూజలు, పంచహారతులు సమర్పించారు. ?చదువుల తల్లి, జ్ఞానస్వరూపిణి అయిన సరస్వతీ దేవి అలంకారంలో కొలువుదీరిన మూలా నక్షత్ర పర్వదినాన ఆదిదంపతులను రథారూఢులుగా దర్శించుకోవడం వల్ల అజ్ఞానం, జడత్వం తొలగి జ్ఞానసంపద, విద్యాబుద్ధులు, కుటుంబ క్షేమం చేకూరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ?ఈ మహోత్సవంలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, సహాయ కార్యనిర్వహణాధికారి, ఆలయ ఉద్యోగులు, అశేష భక్తజనం పాల్గొని ఆదిదంపతుల కృపాకటాక్షాలను పొందారు. సమన్వయకర్త వంగవీటి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. బిఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనసేన పార్టీ శ్రేణులు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ, పార్టీ ఆశయాలను, కూటమి లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుని, ప్రజలకు అందుబాటులో ఉండాలని వారు పిలుపునిచ్చారు. బిజనసేన పార్టీకి బలమున్న ప్రతి ప్రాంతంలో అభ్యర్థుల ఎంపికకు ప్రాధాన్యత ఉంటుందని వారు స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ఎన్నికల ప్రచారం వరకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తూ, కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై ఎంపీ బాలశౌరి సమీక్ష



**మచిలీపట్నం అక్టోబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయం, ప్రచార కార్యాచరణపై ఎంపీ వల్లభనేని బాలశౌరి సమీక్ష సమావేశం నిర్వహిం చారు. మచిలీపట్నంలోని ఎంపీ కార్యాలయంలో సమన్వయకర్తలతో జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల సమన్వయంపై చర్చించారు. ఈ సమావేశంలో మచిలీపట్నం పార్లమెంట్ సమన్వయకర్తలు మండలి వెంకటరామ్, బండి రామకృష్ణ, చిలకలపూడి పాపారావు, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

## ప్రాణాలు కాపాడే సిపిఆర్

**నిమ్రా వైద్య కళాశాలలో ప్రపంచ అనస్థీషియా దినోత్సవం**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16(వార్తా ప్రభ ప్రతినిధి)**:అత్యవసర పరిస్థితులలో సిపిఆర్ ద్వారా ప్రాణాలు కాపాడ వచ్చని నిరూపిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు నిమ్రా వైద్య కళాశాల విద్యార్థులు. స్థానికనిమ్రా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనస్థీషియాలజీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్) పై అవగాహన కల్పించారు. గుండె ఆగిపోయినప్పుడు తక్షణమే సిపిఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు మెరుగుపడతాయని వైద్యులు ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియాలజీ విభాగాధిపతి డాక్టర్ సి. రాకేష్ ,పీజీ డైరెక్టర్ డాక్టర్ కె. శంకర్, డీఎంఎస్ డాక్టర్ డి. శివరంజన్ పాల్గొన్నారు.

## కొండపల్లిలో నామినేషన్ల పర్వం ప్రారంభం

**మొదటిరోజు కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు**




**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16(వార్తా ప్రభ ప్రతినిధి)**:కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం శుక్రవారం ప్రారంభమైంది. మొదటిరోజు కేవలం ఒక నామినేషన్ మాత్రమే దాఖలైనట్లు అధికారులు తెలిపారు. ఇక రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో శనివారం ఆదివారం భారీగా నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశాలు ఉన్నాయి. మొత్తం 40 వార్డులకు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం చేశారు అధికారులు. మొత్తం 10 టేబుల్స్ ద్వారా 40 వార్డుల అభ్యర్థులకు సంబంధించిన నామినేషన్స్ స్వీకరించనున్నారు. చైర్మన్ అభ్యర్థుల నామినేషన్ కొరకు ప్రత్యేకంగా టేబుల్ ఏర్పాట్లు చేశారు. మొత్తం 55 మంది నామినేషన్ ప్రక్రియకు పనిచేస్తున్నారు. స్క్రూట్ని విత్డ్రాల్స్, కౌంటింగ్ అన్ని ఇక్కడే జరుగుతాయని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సీసీ కెమెరాల పరిరక్షణలో నామినేషన్ ప్రక్రియ జరుగుతుందని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం వైఎస్ఆర్సిపి చెందిన చైర్మన్ అభ్యర్థి తో పాటు 40 వార్డులకు సంబంధించిన కౌన్సిలర్ అభ్యర్థులు ఒకేసారి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.

## స్థానిక సంస్థల ఎన్నికల పై మురళిరాజు విస్తృత స్థాయి సమావేశం

**పాలకొల్లు నియోజవర్గంలో మురళిరాజు పర్యటన**




**పాలకొల్లు, అక్టోబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు పాలకొల్లు నియోజవర్గం ఇంచార్జి గుడాల హరి గోపాల్ (గోపి) ఆధ్వర్యంలో ఎలమంచిలి మండలం స్థానిక జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలపై ముఖ్య నాయకులు,కార్యకర్తలతో సమావేశమై చర్చిస్తున్న నర్సాపురం పార్లమెంట్ పరిశీలకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణం రాజు మాజీ ఎస్సీ కమిషన్ ఛైర్‌పర్సన్ చెల్లెం ఆనంద్ ప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి దత్తాత్రేయ వర్మ, సిఇసి సభ్యులు గుణ్ణం నాగబాబు, ఎలమంచిలి మండలం అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్, ఎలమంచిలి ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మి ,రవి , టౌన్ ప్రెసిడెంట్ కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కొంపల్లి, అక్టోబర్ 16, (వార్తాప్రభ) :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొంపల్లి డివిజన్ పరిధిలోని ఎన్‌సీఎల్‌లో రవిచంద్ర శర్మ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ హాజరై దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆనందం, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా భరతనాట్యంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన చిన్నారులను అభినందించడంతో పాటు, ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న రవిచంద్ర శర్మ స్వామిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పండితులు శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, నరేందర్ రెడ్డి, రాజు తదితరులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన మేళా లో సందర్శకులను ఆకట్టుకున్న గిరిజన ఉత్పత్తులు

**సాంస్కృతిక కార్యక్రమాలు**





**శేరిలింగంపల్లి,అక్టోబరు 16 (వార్తాప్రభ):**మాదాపూర్ శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆదివాసీ ఆది బజార్ గిరిజన మేళాలో గిరిజన ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.ఇందులో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో బెంగళూరుకు చెందిన చోళమండలం దివ్య శిష్య బృందం వినాయక కౌతం, అన్నమాచార్య కీర్తనలు, దుర్గ తరంగం తదితర అంశాలను ప్రదర్శించింది. చేతన రవి శిష్య బృందం గణేశ కృతి, బ్రహ్మాంజలి, అంబ స్తవం, కామాక్షి స్తుతి, ఓంకార రూపిణి తదితర అంశాలతో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. కిరణ్మయి, కీర్తి, సౌమ్య, ధరణి, యమున, శ్రీహర్షిత, మృదుల తదితర కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

## అమ్మ వారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

**– బిజెపి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్**



**శేరిలింగంపల్లి,అక్టోబరు 16 (వార్తాప్రభ):**దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఘనంగా జరుగుతున్నాయి.లింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన పలు దుర్గామాత మండపాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని, ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ గౌడ్, రమేష్, శ్రీశైలం, నరసింహ, రాజుశెట్టి, భాస్కర్, సిద్దేశ్, ఎల్లేష్, రాజు, ప్రవీణ్, శంకర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## కలగర గ్రామపంచాయతీకి పెరుగుతున్న పోటీ



**విస్సన్నపేట అక్టోబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గ్రామ పంచాయతీలకు సంబంధించి రిజర్వేషన్ల జాబితా విడుదల కావడంతో స్థానిక మండలంలోని కలగర గ్రామపంచాయతీ ఎస్సీ మహిళ రిజర్వేషన్ అనుసంధానంగా మీడియా రంగంలో విశేష అనుభవం కలిగిన కుటుంబం నుండి గ్రామ సర్పంచిగా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు విశ్వ శ్రీయ వర్గాల సమాచారం అందుతోంది. ఇప్పటివరకు కూటమి నాన్ కూటమి పార్టీల మధ్య ఉన్న ద్వి ముఖ పోటీ స్థానంలో త్రిముఖ పోటీ జరగనున్నదని సర్వత్రా వినిపిస్తుంది.

# కేపీహెచ్‌బీ 9వ ఫేజ్ కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తా

**– బిజెపి నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు**





**కూకట్ పల్లి, అక్టోబర్ 16(వార్తా ప్రభ):**కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ నియామకమైన సందర్భంగా నూతన అధ్యక్షులు జి. రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు నూతన కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కాలనీ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి,కాలనీలో నెలకొన్న సమస్యలు,చేపట్టాల్సిన అభివృద్ధి పనులు,స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ ,కేపీహెచ్‌బీ 9వ ఫేజ్ కాలనీ అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. కాలనీలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, త్వరలోనే కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని తెలిపారు.కాలనీ అభివృద్ధి కోసం నూతన కమిటీ సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.అనంతరం కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పరస్పరం ఆప్యాయంగా సంభాషించారు.ఈ కార్యక్రమంలో కెపిహెచ్బి కంటెస్టెంట్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి, కమిటీ సభ్యులు కే రాహుల్,కే చంద్రమోహన్ రెడ్డి, ఏం వీర గోవిందరావు,ఎన్ తిలక్ కుమార్, కృష్ణార్జున రెడ్డి,ఆర్. ఈశ్వర్ రెడ్డి,పీవీ సత్యనారాయణ, యాదిరెడ్డి,వై వెంకటరత్నం,విజయ్ కుమార్, నాగేశ్వరరావు,రామకృష్ణ రాజు, మధుసూదన్ రెడ్డి,చారి, నందయ్య,బాబురావు,బి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్ పెద్దమ్మ తల్లి ఆలయంలో మాజీ కార్పొరేటర్ ప్రత్యేక పూజలు

**కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.**





**ఎల్బీనగర్/వార్తప్రభ(అక్టోబర్ 16):**దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హయత్‌నగర్‌లోని శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయాన్ని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి మాతృమూర్తి కళ్లెం కళావతి, సతీమణి నవీన, తనయులు వార్షిక్ రెడ్డి, శశాంత్ రెడ్డిలతో పాటు బీజేపీ నాయకులు, ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ అల్లర్లు: గొల్ల నరసింహ యాదవ్



**తిరుపతి: అక్టోబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ దాడులు, అల్లర్లకు పాల్పడుతూ ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు సృష్టిస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ ఆరోపించారు. తాడేపల్లి నుంచి వస్తున్న ఆదేశాలతోనే అల్లర్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో చోటుచేసుకున్న ఘటనలు వైసీపీ హింసాత్మక రాజకీయాలకు నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఇతర ప్రాంతాల నుంచి రౌడీ మూకలను తీసుకొచ్చి దాడులకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను లాక్కొని చించివేయడం, అభ్యర్థులపై దాడులు చేయడం, ఎన్నికల అధికారులను బెదిరించి ఏకగ్రీవాలు సాధించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని నరసింహ యాదవ్ ఆరోపించారు. 2020--21 ఎన్నికల్లో జరిగిన పరిణామాలను ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు.సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి 164 స్థానాలతో చారిత్రక విజయాన్ని అందించారని గుర్తుచేశారు. ప్రజల మద్దతుతోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, యువతకు ఉపాధి అవకాశాలు, తల్లికి వందనం వంటి పథకాలతో ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం ఉందని పేర్కొన్నారు. కూటమికి దాడులు చేసే అవసరం లేదని అన్నారు.స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని, స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునే వాతావరణాన్ని అధికారులు కల్పించాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పార్టీలు, హోదాలతో సంబంధం లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని తెలుగుదేశం పార్టీ కోరుకుంటోందని నరసింహ యాదవ్ తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.25 లక్షల విరాళం



**హైదరాబాద్ : అక్టోబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలంగాణ పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధికి రాధా టీఎంటీ సంస్థ రూ.25 లక్షల విరాళం అందించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అందించిన ఈ మొత్తాన్ని పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదలకు వినియోగించనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. విద్యాభివృద్ధికి సహకరించిన రాధా స్మెల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుమన్ సరాఫ్, సంస్థ బృందాన్ని ఆయన అభినందించారు. పోలీసు కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్యావకాశాలు కల్పించేందుకు ఇటువంటి సహకారం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో ఘనంగా మూలా నక్షత్రం వేడుకలు...



**పెనుగంచిప్రోలు – అక్టోబర్ 16( వార్త ప్రభ )** శ్రీ దేవీ నవరాత్రుల సందర్భంగా శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, నిత్య కళ్యాణ మండపము నందు ఏర్పాటుచేసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం మూల నక్షత్రం సందర్భంగా ప్రత్యేకంగా సరస్వతి దేవి అలంకరణ చేసి,ఆలయ ప్రధాన పూజారి మర్రే బోయి న గోపి బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు,అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసాలు నిర్వహించి, పెన్నులు పుస్తకాలు పలకలు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ జంగం శ్రీనివాసరావు, సూపరింటెంట్ లక్ష్మణ్ టెంపుల్ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణ మనోహర్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసంలో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలు**



**కూకట్ పల్లి, అక్టోబర్ 16(వార్తా ప్రభ):**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు కూకట్‌పల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసంలో ఆయన కుమార్తె కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో పండుగ సందడిని నింపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. పూల పండుగగా పేరుగాంచిన బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందిస్తూ పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి.

## రాజీవ్ గృహకల్పలో ఘనంగా లలితా త్రిపుర సుందరి పూజలు.

**విశేషంగా పాల్గొన్న మహిళలు**



**సూరారం, అక్టోబర్ 16, (వార్తాప్రభ) :** సూరారం రాజీవ్ గృహకల్ప సూరారం కాలనీలోని శ్రీ కనకదుర్గమ్మ మండపంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు జగన్మాతను శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, విశేష అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణ మోహన్ సమక్షంలో ఈ పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణలు నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వర్ధిల్లాలని ఈ సందర్భంగా భక్తులు ప్రార్థించారు. ఈ పూజా మహోత్సవంలో లక్ష్మీ దుర్గ, విజయ, ఉష, బృంద, వెంకట లక్ష్మి, రమ్య, లక్ష్మి, స్వాతి, శిరీష, జైశ్రీ, జై లక్ష్మి, అరుణ తదితర భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అమ్మవారి ప్రసాద వితరణ గావించారు.

## హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో వైభవంగా శ్రీ సరస్వతీ దేవి అలంకరణ

**విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ**



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 16, (వార్తాప్రభ) :** శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీ లో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో శ్రీ సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

**విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ** ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీ నాయకి స్కూల్ యాజమాన్యం నాయకి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిల్ సెట్లు, రబ్బర్లు తదితర విద్యా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు, ఆలయ కమిటీ చైర్మన్ టి. రాజేశ్వర్, శివ, శంకర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, విద్యార్థి విద్యార్థినులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి.



**జవహర్ నగర్ అక్టోబర్ 16 (వార్తా ప్రభ):** అతిగా మద్యం సేవించి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాకే త్ కాలనీ పరిసర ప్రాంతంలో అనీష్ కళాశాల ఎదురుగా సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి గత మూడు నెలలుగా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాడు. అతను తరచూ మద్యం సేవించి పరిసర ప్రాంతాలు తిరుగుతూ మద్యం సేవించేవాడని ఈనెల 16వ తేదీన ఉదయం 9 గంటల 45 నిమిషాలకు స్థానిక పంక్చర్ షాప్ యజమాని తన షాపు వెనుక ఉన్న ఖాళీ స్థలంలో సదరు వ్యక్తి ఎలాంటి కదలికలు లేకుండా ఉండడానికి గమనించాడు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా సదరు వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడానికి గమనించి వెంటనే 108కు సమాచారం ఇవ్వగా అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించి అతను మరణించాడు అని ధ్రువీకరించారు. సదరు వ్యక్తి అధికంగా మద్యం సేవించడం వల్ల లేదా ఇతర కారణాలవల్ల మరణించి ఉండవచ్చునని భావించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డి పై దాడి దుర్మార్గం

**ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి, రెడ్డిగూడెం మండలం మాజీ వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్**



**రెడ్డిగూడెం, అక్టోబర్ 16,(వార్తాప్రభ ప్రతినిధి ):**పుంగనూరులో నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థిని తీసుకెళ్తున్న సమయంలో ఎంపీ మిథున్ రెడ్డిపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి, రెడ్డిగూడెం మండలం మాజీ వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్ తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉందని, నామినేషన్ ప్రక్రియకు ఆటంకాలు కలిగించడం, రాజకీయ నాయకులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థులను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎదుర్కోవాలే తప్ప, దాడులు మరియు బెదిరింపులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని చాట్ల రాబర్ట్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# జి.కొండూరు మండలంలో సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు



**జి.కొండూరు,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు మండలంలోని గ్రామపంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు గాను 7 ఎస్సీ కేటగిరీకి కేటాయించగా, వీరిలో మూడు ఎస్సీ మహిళలకు కేటాయించారు. 3 బీసీ కేటగిరి కి కేటాయించగా, వీటిలో ఒకటి బీసీ మహిళకు కేటాయించారు. అలాగే జనరల్ కేటగిరీకి 11 రిజర్వు అయ్యాయి. వీటిలో 7 జనరల్ మహిళకు కేటాయించారు. ఒకటి ఎస్టీ కేటగిరీకి కేటాయించ డం జరిగింది.

**గ్రామపంచాయతీ సర్పంచుల రిజర్వేషన్ వివరాలు...** 1.ఆత్కూరు -ఎస్సీ, 2. చెవుటూరు-జనరల్, 3.చిన నందిగామ-ఎస్సీ, 4.దుగ్గిరాలపాడు-బిసి, 5.జి.కొండూరు-బిసి, 6.గడ్డమణుగు -జనరల్ (మహిళ),7.గుర్రాజుపాలెం-జనరల్ (మహిళ) 8.గంగినేనిపాలెం-జనరల్ (మహిళ) 9.హెచ్. ముత్యాలంపాడు-ఎస్సీ (మహిళ), 10.కందులపాడు-ఎస్సీ 11.కట్టుబడిపాలెం-ఎస్టీ 12.కవులూరు- జనరల్, 13.సున్నంపాడు జనరల్ (మహిళ), 14.కోడూరు-జనరల్ (మహిళ), 15.కుంటముక్కల-బిసి (మహిళ) 16.మునగపాడు-ఎస్సీ (మహిళ), 17.వినపాక- ఎస్సీ, 18.తెల్లదేవరపాడు- ఎస్సీ (మహిళ), 19.వెలగలేరు-జనరల్ (మహిళ) 20.చెర్వు మాధవరం-జనరల్, 21. వెల్లటూరు-జనరల్, 22.వెంకటాపురం-జనరల్ (మహిళ) కు రిజర్వ్ అయ్యాయి.

# కనకదుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలంతా అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండాలి - మంత్రి పార్థసారథి



**ఆగిరిపల్లి,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి గ్రామంలో కనకదుర్గమ్మ నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ప్రేమ, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రజలంతా అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ ఎం. శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పతనానికి రాహుల్ గాంధీ నాయకత్వమే కారణమా?




**విజయవాడ,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** కాంగ్రెస్ పార్టీ వరుస ఎన్నికల పరాజయాలు, నాయకత్వ వైఫల్యాలు రాజకీయంగా ఆ పార్టీ భవిష్యత్తుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రాజకీయ విశ్లేషణ పేర్కొంది. ఎన్నికల్లో ఓటములకు దారితీసిన వ్యూహాత్మక లోపాలను అంగీకరించి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన కాంగ్రెస్ నాయకత్వం, అందుకు బదులుగా ఇతరులపై ఆరోపణలు చేస్తోందని విమర్శించింది. రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్టీ ఎన్నికల పరాజయాలను ఎదుర్కొంటుండగా, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యూహాలతో బీజేపీ తన రాజకీయ ప్రాబల్యాన్ని విస్తరించుకుందని పేర్కొంది. గుజరాత్ నుంచి బెంగాల్ వరకు, త్రిపుర నుంచి రాజస్థాన్ వరకు కాంగ్రెస్ ప్రభావం తగ్గిందని విశ్లేషించింది. ఎన్నికల పతనం 2024 తర్వాత ప్రారంభమైన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు ముందే మొదలైందని, అయినప్పటికీ రాహుల్ గాంధీ ఆ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారని పేర్కొంది. బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ తన పూర్వ వైభవాన్ని తిరిగి సాధించేందుకు దీర్ఘకాలంగా ప్రయత్నిస్తోందని తెలిపింది. 2029 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి వస్తుందని అమిత్ షా అంచనా వేసిన నేపథ్యంలో, బీజేపీ బలానికి మోదీ నాయకత్వం, దీర్ఘకాలిక రాజకీయ దార్శనికత, సంస్థాగత సామర్థ్యమే ప్రధాన కారణాలని విశ్లేషణ పేర్కొంది. ఎన్నికల పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకోవడం ప్రతి రాజకీయ పార్టీకి అవసరమని స్పష్టం చేసింది.

# కీర్తిశేషులు కొయ్యాడ స్వరూప దశదినకర్మలో బి.సి.నేత భేరి ఘన నివాళి



**హైదరాబాద్, అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** లింగంపల్లి వాస్తవ్యురాలు కీర్తిశేషులు కొయ్యాడ స్వరూప ఇటీవల అక్టోబర్ 5వ తేదీన కాలం చేశారు. వారి కుటుంబ సభ్యులు నిర్వహించిన దశదినకర్మలో బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వాళ్లకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆ దేవుని వేడుకుంటున్నా అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యడ మల్లేష్ యాదవ్, కొయ్యడ నరసింహ యాదవ్,కొయ్యడ శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ నరసింహ యాదవ్, కృష్ణ యాదవ్, అందెల కుమార్ యాదవ్, విష్ణు యాదవ్ మరియు కొయ్యడ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

# ఎన్జీవో హోమ్‌లు ఉద్యోగుల దేవాలయాలు

- 75 ఏళ్లుగా ఉద్యోగుల సేవలో ఎన్జీవోల సంఘం
- ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాజీ పడే ప్రసక్తే లేదు
- అనకాపల్లి నూతన భవన ప్రారంభోత్సవంలో ఏపీఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్







**అనకాపల్లి,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్జీవో హోమ్‌లు ఉద్యోగుల దేవాలయాలని, గత 75 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ఎన్జీవోల సంఘం ఉద్యోగుల సంక్షేమం కోసం విశేష సేవలందిస్తోందని ఏపీఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. అనకాపల్లి జిల్లాలో నూతనంగా నిర్మించిన ఎన్జీవో హోమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్జీవో హోమ్‌లు కేవలం ఉద్యోగుల సంఘ భవనాలు మాత్రమే కావని, ఉద్యోగుల ఉద్యమాలకు, సమావేశాలకు, సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువులుగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులతో పాటు గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ భవనాలు సేవలందిస్తున్నాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వీలైనంత వరకు ఉచితంగా సేవలు అందించాలని, భవనాల నిర్వహణలో నాయకత్వం క్రమశిక్షణ, పారదర్శకత పాటించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ నాయకత్వంలో యువతకు 30% ఎన్జీవో సంఘంలో అవకాశాలు కల్పించామని దానివల్ల సంఘంలో యువతరం పెద్ద ఎత్తున పనిచేస్తుందని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే జిల్లా, నగర శాఖలకు భవనాలను సమకూర్చుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైన అనకాపల్లి జిల్లా కార్యవర్గాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆమనగంటి శ్రీరాములు, సుధాకర్ ప్రసాద్ వంటి మహనీయ నాయకులతో పాటు అనేకమంది జిల్లా, తాలూకా స్థాయి నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఎన్జీవోల సంఘాన్ని బలోపేతం చేసి, భవనాలను నిర్మించి ఉద్యోగులకు సేవలందించారని విద్యాసాగర్ గుర్తుచేశారు. వారి కృషిని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుత తరం నాయకులు ఎన్జీవో హోమ్‌లను కాపాడుకుంటూ, వాటిని ఉద్యోగుల సేవకు అంకితం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎన్జీవోల సంఘం ఎప్పుడూ రాజీపడబోదని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర నాయకత్వం నిరంతరం కృషి చేస్తోందని, ఇప్పటికే అనేక సమస్యలను పరిష్కరించామని, మిగిలిన డిమాండ్ల సాధనకు కూడా రాజీలేని పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

**ఉద్యోగుల వైద్య సేవలు, పెన్షనర్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి..** రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య కార్డులు, వైద్య సేవలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో పురోగతి సాధించే దిశగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా సంఘం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. పెన్షనర్లకు అదనపు పెన్షన్ మంజూరు చేయించే అంశంలోనూ ఎన్జీవోల సంఘం కృషిచేసి అనుకున్నది సాధించింది అని తెలిపారు. పెన్షనర్లు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరై రాష్ట్ర నాయకత్వాన్ని అభినందించడం, ఆశీర్వదించడం ఆనందంగా ఉందన్నారు.

**ఘనంగా నూతన భవన ప్రారంభోత్సవం..** అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి. రమణలకు ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉద్యోగులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి ఎన్జీవో హోమ్‌కు చేరుకున్నారు. ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరవడంతో పాటు బైక్ ర్యాలీ బాణసంచా మహిళల నృత్యాలో ఎన్జీవో హోం పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం కనబడింది. రాష్ట్ర నాయకులు నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొని శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనకాపల్లి జిల్లా ఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానల్‌ను కూడా ప్రారంభించారు. తదనంతరం ఎస్.ఆర్. శంకరన్న సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, జేఏసీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర నాయకత్వానికి ప్రశంసలు అందజేశారు. గత ఏడాది కాలంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ ఉత్తర్వుల విడుదలకు రాష్ట్ర నాయకత్వం చేసిన కృషిని పలువురు వక్తలు ప్రశంసించారు. పీఆర్సీ, ఉద్యోగుల ఆరోగ్య కార్డుల కింద ప్రత్యక్ష చెల్లింపులు, పెన్షనర్ల అదనపు పెన్షన్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్, సరెండర్ లీవ్ తదితర అంశాల్లో సంఘం ఉద్యోగుల పక్షాన నిలబడి కృషి చేసిందని పేర్కొన్నారు. భవన నిర్మాణం, పునర్నిర్మాణ కార్యక్రమాల్లో భాగస్వాములైన యువజన నాయకులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన అనకాపల్లి జిల్లా మహిళా విభాగాన్ని రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్జీవోల నాయకులు భారతి ప్రసాద్, సుబ్బారెడ్డి, రాజు, వేణుగోపాల్, భోం జయ, విజయనగరం జిల్లా అధ్యక్షుడు సురేష్ ఆనందబాబు, పార్వతీపురం జిల్లా అధ్యక్షుడు కిషోర్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు మాధవరావు, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్, అనకాపల్లి జిల్లా కార్యదర్శి శేషు కుమార్, ఎన్జీవో మహిళా విభాగం రాష్ట్ర చైర్మన్ నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీలో మాల కమ్యూనిటీకి జడ్పీటీసీ అవకాశం దక్కేనా?

- పార్టీ కోసం 26 ఏళ్లుగా పనిచేస్తున్న బోళ్ల
- రవికుమార్‌కు అవకాశం కల్పించాలని మాల మహానాడు నాయకుల విజ్ఞప్తి
- మాదిగలకు ఇచ్చిన ప్రాధాన్యత "మాలల"కు ఎందుకివ్వరని ప్రశ్నిస్తున్న సామాజికవర్గ పెద్దలు..



**పెనుగంచిప్రోలు,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీలో మాల సామాజికవర్గానికి తగిన రాజకీయ ప్రాధాన్యత దక్కుతుందా..? రానున్న జడ్పీటీసీ ఎన్నికల్లో మాల కమ్యూనిటీకి అవకాశం కల్పిస్తారా...? ప్రస్తుతం పెనుగంచిప్రోలు మండలంలో ఈ అంశంపై రాజకీయ చర్చ సాగుతోంది. ఎస్సీ రిజర్వేషన్ నేపథ్యంలో ఈసారి జడ్పీటీసీ అభ్యర్థిగా మాల సామాజికవర్గానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, మాల మహానాడు నాయకుడు బోళ్ల రవికుమార్ పేరును పార్టీ అధిష్ఠానం పరిశీలించాలని పలువురు మాల సంఘాల నాయకులు, కుల పెద్దలు కోరుతున్నారు.

**26 ఏళ్లుగా టీడీపీకి సేవలు..** బోళ్ల రవికుమార్ 2001లో సీపీఐ నుంచి తెలుగు దేశం పార్టీలో చేరినట్లు ఆయన వర్గీయులు తెలిపారు. నూతలపాటి చెన్నకేశవరావు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా, అప్పట్లో మంత్రి నెట్టెం రఘురామ్, ఏపీ కాబ్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ సమక్షంలో, టీడీపీ నాయకుడు చింతల వెంకట సీతారామయ్య ఆధ్వర్యంలో రవికుమార్ పసుపు కండువా కప్పుకున్నారని పేర్కొన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఆయన కుటుంబం తెలుగు దేశం పార్టీతో కొనసాగుతోందని తెలిపారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా, ఎస్సీ సెల్ మండల కార్యదర్శిగా పనిచేస్తున్న రవికుమార్ ఇప్పటివరకు ఏ పదవినీ కోరలేదని ఆయన అనుచరులు చెబుతున్నారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ, మండల స్థాయిలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తున్నారని పేర్కొంటున్నారు.

**జర్నలిస్టుగా, ప్రెస్ క్లబ్ కార్యదర్శిగా గుర్తింపు..** రవికుమార్ 21 సంవత్సరాలుగా విలేకరిగా, 14 సంవత్సరాలుగా పెనుగంచిప్రోలు మండల ప్రెస్ క్లబ్ కార్యదర్శిగా కొనసాగుతున్నారని ఆయన వర్గీయులు తెలిపారు. తన సామాజికవర్గానికే పరిమితం కాకుండా ఇతర సామాజికవర్గాల ప్రజలతోనూ సత్సంబంధాలు కొనసాగిస్తూ మంచి గుర్తింపు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఈ అనుభవం, ప్రజలతో ఉన్న పరిచయాలు, పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకొని జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

**మాదిగలకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడు మాలలకు ఎందుకు ఇవ్వకూడదు?..** జగ్గయ్యపేట నియోజకవర్గంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని ఎస్సీ మాదిగ సామాజికవర్గానికి కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేసినట్లుగానే, పెనుగంచిప్రోలు మండలంలో జడ్పీటీసీ అవకాశం మాల సామాజికవర్గానికి కల్పించాలని మాల సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఒక సామాజికవర్గానికి పదవి ఇచ్చినప్పుడు మరో సామాజికవర్గానికి కూడా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ నాయకత్వం మాదిగ సామాజికవర్గానికి ఇస్తున్న ప్రాధాన్యత మాల సామాజికవర్గానికి కూడా ఇవ్వాలని వారు కోరుతున్నారు. మండల స్థాయిలో మాలలకు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా గానీ, నామినేటెడ్ పదవుల ద్వారా గానీ తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదనే అసంతృప్తి తమ వర్గంలో ఉందని పలువురు నాయకులు చెబుతున్నారు.

**అవకాశం కల్పించకపోతే రాజకీయంగా ప్రభావం?..** రానున్న జడ్పీటీసీ ఎన్నికల్లో మాల సామాజికవర్గానికి చెందిన నాయకుడికి అవకాశం కల్పించకపోతే భవిష్యత్తులో టీడీపీపై తమ వర్గంలో వ్యతిరేకత పెరిగే అవకాశం ఉందని కొందరు మాల సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే కీలకంగా మారనుంది. బోళ్ల రవికుమార్ పేరును కూడా పరిశీలించి, ఆయనకు అవకాశం కల్పించాలని మాల మహానాడు నాయకులు కోరుతున్నారు. రవికుమార్‌కు కాకపోయినా, మండలంలో మాల సామాజిక వర్గానికి చెందిన అర్హుడైన నాయకుడికి అవకాశం ఇస్తే, ఆయనను గెలిపించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. మొత్తంగా, పెనుగంచిప్రోలు మండల జడ్పీటీసీ అభ్యర్థి ఎంపికలో మాల సామాజికవర్గానికి ప్రాతినిధ్యం కల్పిస్తారా? పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేస్తున్న బోళ్ల రవికుమార్‌కు అధిష్ఠానం అవకాశం ఇస్తుందా? అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది...

# సరస్వతి దేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చిన కనకదుర్గమ్మ తల్లి

- సరస్వతీ దేవి అనుగ్రహంతో విద్యా, జ్ఞానాభివృద్ధి కలగాలని భక్తుల ప్రార్థనలు



**ఆగిరిపల్లి, అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని వరాహ పుష్కరిణి సమీపంలో కొలువై నిత్యం పూజలు అందుకుంటున్న శ్రీ కనకదుర్గమ్మ తల్లి శుక్రవారం మూలా నక్షత్రం పర్వదినం పురస్కరించుకొని సరస్వతీ దేవి వివిధ పుష్పాల,అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లలిత సహస్రనామము, కుంకుమార్చన, చండీ హోమం ఆలయ కార్య నిర్వహణ అధికారి సిహెచ్ సాయి పర్యవేక్షణలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవులపల్లి శ్రీనివాసు ఈ సందర్భంగా మాట్లాడుతూ, సరస్వతీ దేవి జ్ఞానం, విద్య, వాక్కు, కళలు, సంగీతానికి ప్రతీకగా పూజలందుకుంటారు. తెల్లని వస్త్రాలు ధరించి, వీణను చేతబూని, హంస వాహనంపై దర్శనమిచ్చే సరస్వతీ దేవి విద్యార్థులకు విద్యాబుద్ధులను, కళాకారులకు సృజనాత్మకతను, ప్రతి ఒక్కరికీ వివేకాన్ని ప్రసాదిస్తారని భక్తుల విశ్వాసం. అమ్మవారి అనుగ్రహంతో అజ్ఞానం తొలగి జ్ఞానజ్యోతి వెలగాలని భక్తులు ప్రార్థించారు. సరస్వతీ దేవి అలంకరణలో శ్రీ కనకదుర్గమ్మ తల్లి దర్శనంతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో నిండిపోయింది. ఆలయ ప్రాంగణంలో సుమారు 5 వందల భక్తులకు, అన్నదాన కార్యక్రమం భక్తుల ఆర్థిక సాయంతో నిర్వహించారు.

# మూలా నక్షత్ర యొక్క శుభలగ్న ప్రత్యేక పూజలు



**విస్సన్నపేట ,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని వైసీపీ నాయకులు నెక్కలపు సుబ్బారావు అందరూ ఆనందంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి వారితో తానుండాలి అనే లక్ష్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చదువుల తల్లి సరస్వతీ మాతగా శరన్నవరాత్రుల సంబరాలలో భాగంగా శ్రీ మారెమ్మ అమ్మవారిని దర్శించుకున్నట్లు చెప్పారు. శ్రీ పరాభవ నామ సంవత్సర దక్షిణాయన శరత్ ఋతువు ఆ ఆశ్వయుజ మాసం శుక్లపక్షం షష్టి శుక్రవారం మూలా నక్షత్ర యుక్త శుభ లగ్నంలో అర్చక స్వాములతో ప్రత్యేక పూజలు తమ దంపతులు నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. అనంతరం దేవాలయం బయట మీడియాతో మాట్లాడుతూ రాబోయే మండల ప్రజా పరిషత్ జడ్పిటిసి గ్రామపంచాయతీ ఎన్నికలలో అన్ని స్థానాలకు వైసీపీ పార్టీ పోటీ చేస్తుందని అని చెప్పారు. ఓసి మహిళ రిజర్వేషన్ వెలువడటంతో తమ కుటుంబం నుండి ఎంపీపీ స్థానానికి పోటీ చేస్తార అని ప్రశ్నించగా అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమని ఆయన తెలియజేశారు.

# తిరువూరు మున్సిపల్ చైర్మన్ సీటు జనసేనకు ఖరారు.. టీడీపీలో అసంతృప్తి చర్చ !



**తిరువూరు,అక్టోబర్ 16 (వార్తాప్రభ) :** తిరువూరు మున్సిపల్ చైర్మన్ పదవిని జనసేన పార్టీకి కేటాయిస్తూ కూటమి అధిష్ఠానం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ పరిణామంతో చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్న తెలుగుదేశం పార్టీ నాయకుల్లో అసంతృప్తి నెలకొన్నట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో భాగంగా జనసేనకు చైర్మన్ పదవి కేటాయించడంతో టీడీపీ ఆశావహుల్లో నిరాశ నెలకొన్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లూ పదవిపై ఆశలు పెట్టుకున్న నేతలు అధిష్ఠానం నిర్ణయంపై ఎలా స్పందిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మరోవైపు, ఈ నిర్ణయాన్ని టీడీపీ స్థానిక నాయకత్వం ఎలా స్వీకరిస్తుంది? అసంతృప్తితో ఉన్న నేతలను పార్టీ పెద్దలు ఏ విధంగా సమన్వయం చేస్తారు? కూటమిలోని రెండు పార్టీల మధ్య స్థానికంగా ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయి? అన్న అంశాలు తిరువూరు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. అధిష్ఠానం నిర్ణయంతో తిరువూరు మున్సిపల్ చైర్మన్ సీటు జనసేన ఖాతాలోకి వెళ్లగా.. టీడీపీ ఆశావహుల తదుపరి అడుగులపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188